సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 138
పేజీలు: 08 | వెల: రూ.2:00
విజయవాడ | సోమవారం 18 మే 2026
Published from Hyderabad, Vijayawada.

## 8వ వేతన సంఘం అభ్యర్థనల సమర్పణ గడువు పెంపు!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు), పెన్షనర్లు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్న 8 వేతన సంఘం ప్రక్రియ సంప్రదింపుల దశకు చేరింది. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఉద్యోగ సంఘాలు, స్టేక్ హోల్డర్లతో చర్చలు జరపడం ద్వారా వారి డిమాండ్లు, అంచనాలను కమిషన్ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా చోటు చేసుకున్న 5 ప్రధాన పరిణామాలు, రాబోయే షెడ్యూల్ వివరాలు గురించి చూద్దాం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర అలవెన్స్‌లు సమీక్షించి, సవరించడం కోసం ఈ తాత్కాలిక కమిషన్ ఏర్పాటు చేస్తారు. సాధారణంగా ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి కొత్త వేతన సంఘాన్ని నియమించడం ప్రభుత్వం ఆనవాయితీగా వస్తోంది. ఉద్యోగుల సంక్షేమాన్ని పెంపొందించడం, వారి డిమాండ్లను వినడం, ప్రభుత్వ వ్యయ నిర్వహణను బ్యాలెన్స్

మిగతా 3 లో..



## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇప్పటివరకు, సీజేఐతో సహా

మిగతా 2 లో..



## నేడు కేరళం సీఎంగా వీడీ శతీశన్ ప్రమాణం..

కేరళం రాజకీయాల్లో భారీ మార్పు చోటుచేసుకుంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఘనవిజయంతో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ( రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.

మిగతా 3 లో..



## ఉప్పల్ క్రాస్ రోడ్డు మూసివేత..

**3 నెలలపాటు వాహనాల దారి మళ్లింపు**

హైదరాబాద్ నగరంలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్‌లో పురోగతి లభించింది. ఈ కారిడార్‌లో ప్రధానమైన ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. పిల్లర్ నిర్మాణ

మిగతా 2 లో..

# మళ్లీ యుద్ధం తప్పదా?

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు

మరింత తీవ్రమవుతున్న సంకేతాలు..!?

మరోమారు ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు

ట్రంప్ వార్నింగ్‌తో యుద్ధ ప్రకంపనలు..!!

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉన్న పరిస్థితులు తుఫాన్ కు ముందు వచ్చే ప్రశాంతత అంటూ అభివర్ణించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో ఏఐ చిత్రంతో కూడిన పోస్టు చేశారు. తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక ఏఐ ఫోటోలో ట్రంప్.. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అనే టోపీ ధరించి.. ఒక అమెరికా నేవీ అడ్మిరల్ తో కలిసి ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి మధ్య ఒక నేవీ నౌకలో వారిద్దరూ ఉండగా.. మధ్యలో ఇరాన్ నౌకలు కూడా కనిపిస్తున్నాయి. అధ్యక్షుడు అనుమతి ఇస్తే చాలు.. ఇరాన్ పై దాడులకు చేసేందుకు రక్షణ శాఖ ఏర్పాట్లు చేసుకుంటుందన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ పోస్ట్ షేర్ చేయడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.**



అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో షేర్ చేసిన ఏఐ ఫొటో అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. తుపాను వచ్చే ముందు ప్రశాంతతే ఉంటుందనే అర్థం వచ్చేలా ట్రంప్ చేసిన పోస్టు, ఇరాన్‌కు పరోక్ష హెచ్చరికగా భావిస్తున్నారు. ఇరాన్‌పై మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించాలా అనే అంశంపై ట్రంప్ తన సీనియర్ భద్రతా సలహాదారులతో చర్చలు జరుపుతున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెలువడుతున్న వేళ ఆ పోస్టు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమలులో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం చాలా సున్నితమైన దశలో ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో షేర్ చేసిన ఏఐ ఫొటోలో సముద్రంలో భారీ అలల మధ్య యుద్ధనౌకలు ప్రయాణిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ట్రంప్ మేక్ అమెరికా

మిగతా 2 లో..

## మరింత సమర్థంగా సంచార వైద్యసేవలు

- 04 సంచార వైద్య వాహనాలకు కొత్త రూపు
- పల్లె ముంగిటకు చేరువలో వైద్య పరీక్షలు
- 41 రకాల మెడికల్ టెస్ట్‌లు చేసేలా ఏర్పాట్లు
- ఏటా 56.40 లక్షల మందికి లక్ష్యంగా ముందుకు




పల్లెల్లో రోగులకు 104 సంచార వైద్యసేవలను మరింత సమర్థంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే పల్లె ముంగిటకు వైద్య పరీక్షలు చేరువ చేసి, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే 104 సంచార వైద్య వాహనాలకు కొత్త రూపు ఇచ్చి 41 రకాల మెడికల్ టెస్ట్‌లు చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఏటా 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.162.72 కోట్లు వెచ్చించనుంది. అంతేకాకుండా పేషెంట్ల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నిర్వహించనుంది. ఇటీవలే వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు పరిపాలన ఆమోదం, నిర్వహణ మార్గదర్శకాలు జారీకి కేబినెట్ అనుమతిచ్చింది.

## ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు
- ఇంజినీరింగ్‌లో 73.36 శాతం ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన కేశవరావు




తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి సమక్షంలో ఆదివారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ ర్యాంకులను తెలుసుకోవచ్చు. పరీక్షలు పూర్తయిన కేవలం ఆరో రోజే ఫలితాలను విడుదల చేస్తుండటం ఈసారి ప్రత్యేకత. ఈ ఏడాది పరీక్ష రాసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా కంప్యూటర్ స్క్రీన్‌పైనే మార్కులు కనిపించేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇంజినీరింగ్ విభాగంలో 1,97,241 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 84,954 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎం. రుషి (ఉప్పల్) ఫస్ట్ ర్యాంక్ (156.64/160) సాధించగా.. అన్షుల్ (మూసాపేట) రెండో ర్యాంక్ (148.70), ఎం. వంశీధర్‌రెడ్డి (పులివెందుల) మూడో ర్యాంక్ (147.05), జె. రోషన్ మణిదీప్‌రెడ్డి (గుంటూరు) నాలుగో ర్యాంక్ (144.44),

మిగతా 3 లో..



# నిప్పుల కొలిమి

- ఉగ్రరూపం దాల్చనున్న భానుడు
- వచ్చే వారం రోజులు అప్రమత్తంగా ఉండాల్సిందే
- ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం
- మే 19 నుంచి 24 వరకు తీవ్ర వడగాలులు
- అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

ఈ నెల 19 నుండి 24వ తేదీల మధ్య పగటి వేళల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. సగటు ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం ఉందని , తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు ముఖ్యంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని వాతావరణ నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత ఎక్కువగా నీళ్లు తాగితే డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా ఉంటారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లాలని,

మిగతా 2 లో..

**తెలంగాణలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. కాగా రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అధిక ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.ఈ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ 16 జిల్లాల్లో 41 నుంచి 44 మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.**

## నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

**కేశవరావు నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ**



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఈ కమిటీ ఆదివారం తొలిసారి సమావేశమై, అసలైన ఉద్యమకారులను నాలుగు కేటగిరీల కింద గుర్తించాలని తీర్మానించింది. ఈ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని కమిటీ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

మిగతా 3 లో..

## భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదు

- స్వయంగా లొంగిపోయాడు: న్యాయవాది స్పష్టీకరణ
- భగీరథ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదని, అతనే స్వయంగా లొంగిపోయాడని ఆయన తరపు న్యాయవాది కరుణా సాగర్ స్పష్టం చేశారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌కు మేజిస్ట్రేట్

మిగతా 3 లో..

# సంపాదకీయం

## దేశ ఆర్థిక వృద్ధికి దెబ్బ

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ మోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చుంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కోనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్టర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

# మళ్లీ యుద్ధం తప్పదా?




**మొదటిపేజీ తరువాయి..**

గ్రేట్ అగైన్ క్యాప్ ధరించి ఉండగా, ఆయన పక్కన అమెరికా నౌకాదళానికి చెందిన ఓ అడ్మిరల్ నిలబడి ఉన్నారు. సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ జెండాలు కనిపించడం గమనార్హం. మెరుపులు, అల్లకల్లోల వాతావరణం మధ్య కామ్ బిఫోర్ ది స్టోర్మ్ అనే సందేశాన్ని ఆయన పోస్టు చేశారు. ఆ పోస్టును ఇరాన్‌కు నేరుగా ఇచ్చిన హెచ్చరికగా అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు నిలిచిపోతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమన్న సంకేతాన్ని ట్రంప్ ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. ఇక ఫ్రాన్స్‌కు చెందిన ఓ వార్తా సంస్థకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో కూడా ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ త్వరగా ఒక శాంతి ఒప్పందానికి రావాలని, లేదంటే చాలా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నప్పటికీ తుది ఒప్పందం కుదురుతుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేమన్నారు. అయితే తమతో ఒప్పందానికి రావాలనే ఆసక్తి ఇరాన్‌కు ఉందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఇరాన్ విషయంలో ట్రంప్ ఓ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. తమతో శాంతి ఒప్పందాన్ని ఇరాన్ వీలైనంత త్వరగా కుదుర్చుకోనట్లయితే ఇబ్బందులు తప్పవని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ డీల్ తో ఇరాన్ కే ప్రయోజనం ఉంటుందని ఓ టీవీ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అయితే మధ్యప్రాచ్యంలో ఏప్రిల్ 8న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా అమల్లో ఉన్నప్పటికీ, కీలకమైన హోర్ముజ్ జలసంధి సముద్ర మార్గంపై ఉద్రిక్తతలు తగ్గే సూచనలు లేని సమయంలో ట్రంప్ ఈ చిత్రాన్ని పంచుకున్నారు. ఇక ఇరాన్ వాదన ఏంటంటే.. కొత్త చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ ప్రభుత్వం నుంచి తమ ప్రభుత్వానికి సందేశాలు అందాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు. అయితే.. వాషింగ్టన్ అసలు ఉద్దేశాలపై అపనమ్మకం ఇంకా ఉందని ఆయన హెచ్చరించారు. గత నెలలో కాల్పుల విరమణకు అంగీకరించినప్పటికీ, శాశ్వత శాంతి ఒప్పందం అనేది ఇంకా సుదూర లక్ష్యంగానే మిగిలిపోయింది. అమెరికా తన కొన్ని ప్రధాన యుద్ధనౌకలను గల్ఫ్ ప్రాంతంలోనే ఉంచింది. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్, 11 నెలల మోహరింపు తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చింది. హర్మోజ్ జలసంధి, అణ్వాయుధాల అభివృద్ధి నియంత్రణ విషయంలో ఇరు దేశాల మధ్య ఏకాభిప్రాయం లేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిపై నియంత్రణ, ఇరాన్ అణు కార్యక్రమం అంశాలపై జరిగిన చర్చలు గత నెలలో నిలిచిపోయాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. దీంతో ప్రపంచ దేశాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ అంశంపై ట్రంప్ ఇటీవల చైనా అధ్యక్షుడు జీ జినిపింగ్‌తో కూడా చర్చలు జరిపినట్లు సమాచారం. వచ్చే వారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. ఇరాన్‌కు చైనా కీలక వ్యూహాత్మక భాగస్వామిగా ఉండటంతో పాటు హర్మూజ్ జలసంధి మార్గంలో జరిగే ఇంధన రవాణాపై బీజింగ్ అధికంగా ఆధారపడుతోంది. ఇదిలా ఉండగా, అమెరికా నౌకాదళం అమలు చేస్తున్న దిగ్బంధన చర్యల వల్ల ఇరాన్‌కు రోజుకు సుమారు 500 మిలియన్ డాలర్ల మేర నష్టం జరుగుతోందని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిపై ప్రస్తుతం అమెరికాకే పూర్తి నియంత్రణ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు పరిస్థితులను చక్కదిద్దేందుకు పాకిస్థాన్ కూడా దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తాజాగా టెహ్రాన్‌కు చేరుకుని చర్చలు జరుపుతున్నారు. అంతకుముందు ఆ దేశ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ కూడా ఇరాన్ పర్యటించారు. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, ప్రధాన చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ తమ ప్రభుత్వం ప్రతిపాదించిన 14 అంశాల శాంతి ప్రణాళికను అంగీకరించకపోతే ఇతర మార్గాలన్నీ ఫలితం ఇవ్వవని హెచ్చరించారు. అలాగే హర్మూజ్ జలసంధిలో ప్రత్యేక మార్గం ద్వారా నౌకా రాకపోకలను నియంత్రించే ప్రొఫెషనల్ మెకానిజం అమలు చేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌తో సహకరించే దేశాల వాణిజ్య నౌకలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులపై పరిమితులు కొనసాగుతాయని వెల్లడించింది.

# నిప్పుల కొలిమి

**మొదటిపేజీ తరువాయి..**

లేకపోతే తలకు క్యాప్ ధరించాలని సూచించారు. మొన్నటివరకూ అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఎండల తీవ్రత దృష్ట్యా తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా, మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుండి 44 డిగ్రీల వరకు ఉండగా.. వచ్చే వారం రోజులపాటు పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటవచ్చని అంచనా విపత్తుల నిర్వహణ కేంద్రం అంచనా వేసింది.సాధారణంగా వేసవిలో చెమట ఎక్కువగా వస్తుంది. వచ్చే వారం ఎండ వేడికి చెమట రూపంలో శరీరం నుంచి ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా పోతుంటాయి. దాంతో తీవ్రమైన అలసట మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. వీలైనంత ఎక్కువ నీరు తాగాలి. కొబ్బరి బొండం, మజ్జిగ, ఓఆర్ఎస్ , నిమ్మరసంలో కొద్దిగా ఉప్పు, చక్కెర కలుపుకుని తాగినా ప్రయోజనం ఉంటుంది. ఎండలో ప్రయాణించాల్సి వస్తే, బయటకు వెళ్లాల్సి వస్తే వెంట గొడుగు తీసుకెళ్లాలి. లేకపోతే తలకు టోపీ లేదా తెల్లటి బట్ట కట్టుకోవడం



వేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు , అనారోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రేకుల ఇళ్లలో ఉండేవారు వేడిని తగ్గించుకోవడానికి ఇంటి రేకులపై ఎండుగడ్డి లేదా తడిపిన జనపనార సంచులు వేస్తే కాస్త ఉపశమనం ఉంటుంది. ఏపీలో మే 18న 28 మండలాల్లో వడగాలులు వీచనున్నాయి. మంగళవారం 84 మండలాల్లో తీవ్ర వడగాలులు వీచనున్నాయి. సోమవారం నాడు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, బూర్జ, నందిగం, పాతపట్నం, హిరమండలం, కంచిలి, సోంపేటలో.. విజయనగరం జిల్లాలో దత్తిరాజేరు, గంట్యాడ, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి, మెరకముడిదాం, రామభద్రాపురం, సంతకవిటి, తెర్లాం, వంగరలో, మన్యం జిల్లాలోని జియ్యమ్మవలస, కొమరాడ, బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పాచిపెంట, పాలకొండ, సాలూరు, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో వడగాలులు వీచనున్నాయి. ద్రోణి ప్రభావంతో మే 18న మన్యం, అల్లూరి, పోలవరం, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ మంచిది. ముక్కు, చెవుల ద్వారా వేడి గాలి లోపలికి వెళ్లకుండా కర్చీఫ్ కట్టుకోవాలి. శరీరానికి గాలి ఆడేలా ఉండే వదులైన కాటన్ దుస్తులు ధరించడం ఎంతో మంచిది.బ్లడ్ ప్రెజర్ కంట్రోల్ కోసం కొన్ని రకాల మందులు వాడేవారిలో మూత్ర విసర్జన ఎక్కువగా ఉంటుంది. కనుక మూత్రం ద్వారా సోడియం, పొటాషియం బయటకు పోతాయి. ఇలాంటి వారు సాధారణం కంటే ఎక్కువ నీరు, పండ్ల రసాలు, ఇతర ద్రావణాలు తీసుకోవాలి.మే 19 నుంచి వారం రోజులపాటు వడగాలులు, మరోవైపు భానుడి ప్రతాపానికి ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. రోడ్డుపై కానీ, ఇంట్లో కానీ ఎవరైనా వడదెబ్బకు గురై అస్వస్థతకు లోనైతే.. వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీరాన్ని పూర్తిగా తడి గుడ్డతో తుడవాలి. వారికి గాలి బాగా ఆడేలా చూడాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించి, అవసరమైతే హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అవుతుంటే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. తరువాత వైద్యుల సూచనలు పాటించి వారికి ఆహారం ఇవ్వాలి.

# మెక్సికోలో నరమేధం

### ప్యూబ్లా రాష్ట్రంలో సాయుధుడి కాల్పులు ఘటనలో చిన్నారి సహా 10 మంది మృతి



మెక్సికోలో జరిగిన కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్యూబ్లా రాష్ట్రంలోని తెహ్విట్జింగోలో ఓ సాయుధుడు జరిపిన కాల్పుల్లో 10 మంది మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగినట్లు స్థానిక పబ్లిక్ సెక్యూరిటీ ఏజెన్సీ తెలిపింది. అయితే ఈ కాల్పుల వెనక ఉన్న కారణం ఇంకా తెలియరాలేదు. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**మొదటిపేజీ తరువాయి..**

సుప్రీం కోర్టులో ఉన్న న్యాయమూర్తుల సంఖ్య 34గా ఉండగా ప్రస్తుత పెంపుతో ఆ సంఖ్య 38కి చేరింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం మే 5న



ఆమోదం తెలిపింది. సుప్రీం కోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టం, 1956ను సవరిస్తూ న్యాయ మంత్రిత్వ శాఖ శనివారం ఈ ఆర్డినెన్స్‌ను నోటిఫై చేసింది. రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఇందుకు అనుగుణంగా బిల్లు ప్రవేశపెట్టనున్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టం, 1956'లోని సెక్షన్ 2ను సవరించారు. దీని ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా ఇతర న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37కు పెరిగింది. దీంతో సీజేఐతో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరగనందున, రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టరూపం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో ఏర్పడిన నాలుగు అదనపు న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం త్వరలో పేర్లను సిఫార్సు చేసే ప్రక్రియను ప్రారంభించనుంది.

## ఉప్పల్ క్రాస్ రోడ్డు మూసివేత..

**మొదటిపేజీ తరువాయి..**

పనుల్లో భాగంగా ఉప్పల్ చౌరస్తాను మూసివేయనున్నారు. ఫ్లైఓవర్ పనులు చకచకా జరిగేలా ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నగరం నలువైపులా నుంచి రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గం మూసివేతతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అధికారులు ట్రాఫిక్ మళ్లింపు చేశారు. ట్రాఫిక్ మళ్లింపు ఇలా ఉంది. అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ చౌరస్తాను ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేశారు. ఉప్పల్ విద్యుత్ జంక్షన్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ నిర్మాణ పనుల్లో భాగంగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నుంచి ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా వరంగల్ వైపు వెళ్లే అన్ని రకాల వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. జీహెచ్ఎంసీ కార్యాలయం పక్కనున్న వరంగల్ బస్టాప్‌ను ఇప్పటికే ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్దకు మార్చిన



విషయం విదితమే. హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే భారీ వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం, మల్లాపూర్, ఐవోసీ, చెంగిచర్ల మీదుగా వరంగల్ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. చిన్న వాహనాలు ఉప్పల్ ఇందిరాగాంధీ పార్కునుంచి లిటిల్ ఫ్లవర్ వెనక దారి నుంచి వరంగల్ రహదారికి చేరుకోవచ్చు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు ఉప్పల్ ఏషియన్ సినీ థియేటర్ ఎదుటి హెచ్ఎండీఏ రోడ్డు ద్వారా నాగోల్ రోడ్డుకు కలుపుతారు. ద్విచక్ర వాహనదారులు నాగోల్ మెట్రో పిల్లర్లు 812, 813 నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా భారీ వాహనాలను కూడా దారి మళ్లించారు. నాగోల్ బ్రిడ్జి కింద నుంచి యూ టర్న్ చేసుకుని తిరిగి ఉప్పల్ వైపు రావాలి. వరంగల్ వైపు వెళ్లేవారు హెచ్ఎండీఏ లే అవుట్ నుంచి వరంగల్ హైవేకు చేరుకోవాలి. హైదరాబాద్‌కు వచ్చే వరంగల్ బస్సులు, లారీలు, భారీ వాహనాలన్నీ ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్ మీదుగా నగరానికి చేరుకోవాల్సి ఉంటుంది.

## నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

మొదటిపేజీ తరువాయి..

దీని ప్రకారం, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉద్యమ సమయంలో గాయపడిన వారిని రెండో కేటగిరీలో, అరెస్టులు, జైలు జీవితం, కేసులు ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరీలో చేర్చనున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని నాలుగో కేటగిరీ కింద గుర్తించనున్నారు. వీరిని గుర్తించేందుకు అప్పటి వార్తాపత్రికల క్లిప్పింగులను ఆధారంగా తీసుకోనున్నారు. గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, తమ ప్రక్రియ అలా ఉండదని కమిటీ తేల్చిచెప్పింది. ఉద్యమకారుల గుర్తింపునకు కఠినమైన ప్రమాణాలను రూపొందిస్తామని, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గౌరవం అందించేందుకు సమగ్ర డేటాబేస్ సిద్ధం చేస్తామని పేర్కొంది. 1969, 1972, 1996 నాటి ఉద్యమకారులతో పాటు వివిధ ఉద్యోగ, కుల, న్యాయవాద, కళాకారుల జేఏసీల నుంచి కూడా సూచనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, అలాగే అభిప్రాయ సేకరణ కోసం జిల్లాల పర్యటనలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదు

మొదటిపేజీ తరువాయి..

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన కొన్ని గంటల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. స్వచ్ఛందంగా లొంగిపోవడాన్ని 'అరెస్ట్'గా చిత్రీకరించడం ద్వారా పోలీసులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే, సైబరాబాద్ పోలీసులు మాత్రం భగీరథ్‌ను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. మే 16న రాత్రి 8:15 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిరేవుల టెక్ పార్క్ వద్ద పక్కా సమాచారంతో భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణలో నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని, అనంతరం ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ విధించారని తమ ప్రకటనలో పేర్కొన్నారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో మే 8న భగీరథ్‌పై పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద సెక్షన్లను చేర్చారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. తన కుమారుడు అరెస్ట్ కాలేదని, న్యాయవాదుల సమక్షంలో విచారణకు హాజరయ్యాడని బండి సంజయ్ సైతం శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి..

ఎ. సాయినిఖిత్ (మహబూబ్‌నగర్) ఐదో ర్యాంక్ (143.30) సాధించారు. ఎప్‌సెట్ పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు వెలువడటం విశేషం. ఇంజినీరింగ్‌లో టాప్-10 ర్యాంకర్ల వివరాల్ని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ యోగితా రాణా వివరించారు. ఫలితాల కోసం లింక్ క్లిక్ చేయండి. ఫలితాల లాగిన్ విండోలో అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును సులభంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాలో టాపర్స్‌గా నిలిచిన వారి వివరాల్ని సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 3వ, 4వ ర్యాంకులో నిలిచిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు. కాగా అగ్రికల్చర్, ఫార్మాలో 6,7,9వ స్థానాల్లో నిలిచిన వారు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అని అధికారులు తెలిపారు.గతేడాది ఇంజినీరింగ్‌లో 73.26 శాతం కాగా ఈసారి 73.36 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. గతంలో పోలిస్తే అగ్రికల్చర్ ఫార్మాలో ఉత్తీర్ణత 1.55 శాతం తగ్గింది.

## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం..

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం పరిధిలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్‌ప్లాంట్ లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్-3 లో అకస్మాత్తుగా మంటలు చెలరేగగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు ప్లాంట్ అంతటా వ్యాపించాయని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత కారణంగా పవర్ ప్లాంట్ పరిసర ప్రాంతాలన్నింటిలోనూ ఆకాశంలో దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్ లోపల జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారు? ఎవరికైనా గాయాలయ్యాయా? ఎంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు ప్లాంట్ పరిసరాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పంప్ వద్ద ఆయిల్ లీకేజీ కావడం వల్లే ప్రమాదం జరిగినట్లు మరోలా ప్రచారం జరుగుతోంది. పవర్ ప్లాంట్ ఆవరణలో దట్టమైన పొగ అలుముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రధాన యంత్రాలకు ముప్పు తప్పగా.. కంట్రోల్ కేబుల్స్, వాల్వ్‌లు దెబ్బతిన్నట్లు సమాచారం అందుతోంది.

## 8వ వేతన సంఘం అభ్యర్థనల సమర్పణ గడువు పెంపు!

మొదటిపేజీ తరువాయి..

చేయడం ఈ కమిషన్ ప్రధాన లక్ష్యం. ప్రస్తుత 8 వ వేతన సంఘం నవంబర్ 3, 2025న అధికారికంగా ఏర్పాటు అయ్యింది.

ఈ సంఘం తీసుకునే నిర్ణయాలు సుమారు1.1 కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబ సభ్యులపై నేరుగా ప్రభావం చూపుతాయి. 8వ వేతన సంఘం మే 13, 14 తేదీల్లో ఢిల్లీలో కీలక సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల్లో ప్రధానంగా రక్షణ, రైల్వే యూనియన్లతో కమిషన్ సభ్యులు చర్చలు జరిపారు. ఉద్యోగుల వేతన సవరణ, అలవెన్స్‌లు, పెన్షన్లకు సంబంధించిన ప్రాథమిక అంచనాలను కమిషన్ ముందు యూనియన్లు ఉంచాయి. ఉద్యోగ సంఘాలకు ఊరట కల్పించే విధంగా కమిషన్ తన మెమోరాండం సమర్పణ గడువును పొడిగించింది. తాజా ప్రకటన ప్రకారం ఈ గడువును మే 31, 2026 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల వివిధ సంఘాలు తమ డిమాండ్లను మరింత లోతుగా విశ్లేషించి, నివేదికలను సమర్పించడానికి అదనపు సమయం లభించినట్టైంది. దేశవ్యాప్తంగా ఉన్న క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి కమిషన్ వివిధ ప్రాంతాల్లో పర్యటించనుంది. మే 18-19 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటిస్తుంది. ఇక్కడ స్టేక్ హోల్డర్స్‌తో మాట్లాడబోతోంది. జూన్ 1-4 మధ్య జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తారు. జూన్ 8న లడఖ్ ప్రాంతంలో చర్చలు జరుపుతారు. ఉద్యోగులందరి దృష్టి ప్రస్తుతం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ పైనే ఉంది. ఏడో వేతన సంఘం సమయంలో ప్రభుత్వం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను వర్తింపజేసింది. ఈసారి అది ఎంత ఉంటుంది అనే దానిపై ఇంకా స్పష్టత రానప్పటికీ ఉద్యోగ సంఘాలు దీనిని గణనీయంగా పెంచాలని కోరుతున్నాయి. 8 వ వేతన సంఘం ప్రస్తుతం ఫీడ్‌బ్యాక్ సేకరించే దశలో ఉంది. ద్యోగుల్లో ఉన్న ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాలని ఆల్ ఇండియా ఎన్పీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గట్టిగా డిమాండ్ చేస్తోంది. పలు డిమాండ్లతో సమగ్రమైన మెమోరాండం కమిషన్‌కు సమర్పించింది. ఉద్యోగి పదవీ విరమణ చేసే సమయంలో తీసుకునే చివరి బేసిక్ జీతంలో కనీసం 50 శాతం మొత్తాన్ని దానికి తోడు కరవు భత్యాన్ని కలిపి నెలవారీ పెన్షన్‌గా అందించాలని డిమాండ్ చేసింది. ఒకవేళ పెన్షనర్ మరణిస్తే వారి కుటుంబానికి ఆ పెన్షన్ మొత్తంలో 60 శాతాన్ని ఫ్యామిలీ పెన్షన్‌గా ఇవ్వాలి. ఎన్పీఎస్ కింద చేరిన ఉద్యోగులు 2033 నుంచి పెద్ద సంఖ్యలో రిటైర్ కాబోతున్నారు.

## నేడు కేరళం సీఎంగా వీడీ శతీశన్ ప్రమాణం..

మొదటిపేజీ తరువాయి..

డియంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువు దీరనుంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీడీ సతీశన్ కేరళ 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు 20 మంత్రులు కూడా ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ నిర్వహిస్తారు. ఆయన తమిళనాడు అదనపు ఛార్జ్ కూడా ఐదుగురు, జోసెఫ్ నేతృత్వంలోని కేరళ కాంగ్రెస్, జాకబ్ నేతృత్వంలోని కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్పీ, జవీూ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మొత్తం 21 మంది ఉన్న క్యాబినెట్‌లో 14 మంది కొత్తవారు. వీరిలో ఇద్దరు మహిళలు, రాజ సమాజానికి చెందిన ఇద్దరు ఉన్నారు. సామాజిక, ప్రాంతీయ సమతుల్యాన్ని దృష్టిలో ఉంచుకుని జాబితా ఖరారు చేశారు. ఈ కేబినెట్ జాబితాలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రమేష్ చెన్నితాల, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్, కె. మురళీధరన్ వంటి దిగ్గజాలకు చోటు లభించింది. మంత్రివర్గ ప్రకటనతో పాటు, అసెంబ్లీలోని కీలక పదవులను కూడా యూడీఎఫ్ ఖరారు చేసింది. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను కేరళ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకోగా, షానిమోల్ ఉస్మాన్ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి



చూస్తున్నారు. ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ 102 స్థానాల్లో అఖండ విజయం సాధించి నిర్ణయాత్మక మెజారిటీని కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా 63 స్థానాలు సాధించి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాగా, గత 2021 ఎన్నికల్లో 99 స్థానాలతో అధికారంలోకి వచ్చిన లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఈసారి కేవలం 35 స్థానాలకే పరిమితమై భారీ పరాజయాన్ని చవిచూసింది. ముఖ్యమంత్రి కాకుండా కాంగ్రెస్ నుంచి 11 మంది మంత్రులు మంత్రి వర్గంలో ఉంటారు. ×ఖమీా నుంచి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా హాజరుకానున్నారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు హాజరవుతారు. తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్‌కి ఆహ్వానం అందింది. మాజీ సీఎం పినరయి విజయన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ తదితరులు కూడా హాజరుకానున్నట్లుగా తెలుస్తోంది.

## బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం బండి భగీరథ్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే దీనిపై కల్వకుంట్ల కవిత సైతం కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీకి లేఖను రాశారు. ఇక తాజాగా.. కేటీఆర్ సైతం మైనర్ బాలిక కేసులో విచారణ పారదర్శకంగా సాగాలంటే బండి సంజయ్ ను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కేంద్రం కు డిమాండ్




చేశారు. ఈ క్రమంలో ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంపై,అటు బీజేపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. బండి భగీరథ్ కేసులో ప్రధానమంత్రి మోడీ గారు "బేటీ బచావో.. బేటీ పఢావో" స్లోగాన్ పై కేటీఆర్ వ్యంగ్యంగా మాట్లాడారు. కేవలం నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని మోదీని కోరారు. భారత దేశంలో మొట్టమొదటిసారిఒక కేంద్ర మంత్రి కొడుకు మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిని ఇవాళ మీరు బర్తరఫ్ చేయకపోతే ఇక్కడ విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ తప్పు చేసిన కొడుకుని ఎవరు తొమ్మిది రోజులు దాచిపెట్టారని ఏకిపారేశారు. ఇలాంటి వ్యక్తులు పదవుల్లో కొనసాగడం అది తెలంగాణకే కాదు, భారతదేశానికి కూడా అవమానకరమన్నారు.మైనర్ బాలికకు అన్యాయం చేసింది కేంద్ర మంత్రి కొడుకైతే, మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని భయభ్రాంతులకు గురిచేసింది స్వయంగా కేంద్ర మంత్రి అని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ పిలిచి, బెదిరించి, వాళ్లను మరి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఇంత తీవ్రమైన కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఏకిపారేశారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్ లో వేసి, మీడియాను గొంతు నొక్కి, వాళ్లను కూడా వార్తలు రానీయకుండా ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కలిసి దీనిలో భాగస్వాములు అయ్యారని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి సంజయ్ గారిని వెంటనే బర్తరఫ్ చేయకపోతే రేపు ఏ ఆడపిల్ల కూడా తనపై ఏదైన జరిగితే బైటకు రావడానికి ధైర్యం చేయదన్నారు. పెద్దవాళ్ళు తప్పించుకుంటారు, అధికారంలో ఉన్నవాళ్లకు ఇబ్బంది కాదు అనుకుంటే, ఏ ఆడకూతురు కూడా రేపు బయటికి వచ్చి మళ్ళీ కంప్లైంట్ చేయడానికి కూడా భయపడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర మంత్రిని తొలగించాలి, విచారణ నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నారు. కేంద్ర మంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. కానీ ఆ తల్లితండ్రి అదరలేదు, బెదరలేదన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా, ఆ తల్లిదండ్రి వెనకడుగు వేయలేదన్నారు. బండి సంజయ్ కొడుకు భగీరథ అనే కామాంధుని చేతిలో విలవిలలాడిన అమ్మాయికి న్యాయం చేయాలని చెప్పి ఆ తల్లిదండ్రి చేసిన పోరాటం గొప్పదన్నారు. వీరి కుటుంబంకు బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకత్వం, మన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి కూడా గట్టిగా చప్పట్లతో అభినందనలు చెప్పాలన్నారు.

## ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్

### ఏఐ, ఫిన్‌టెక్, స్పేస్ రంగాల్లో గ్లోబల్ పరిష్కారాలు
### భారత్-యూరప్ ఎఫ్‌టీఏ త్వరితగతిన అమలు కావాలి
### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

భారత్-యూరప్ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి, ఉమ్మడి శ్రేయస్సుకు బలమైన స్తంభాలుగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా



అనిశ్చిత పరిస్థితులు, సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి, ఇంధన భద్రత, వాతావరణ మార్పుల సవాళ్ల మధ్య భారత్ యూరప్ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో వోల్వో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యూరోపియన్ సీఈఓ రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్టార్టప్ వ్యవస్థ ప్రపంచంలో మూడో అతిపెద్దదిగా ఎదిగిందని తెలిపారు.'ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను కలిగి ఉంది. మన స్టార్టప్స్ ఏఐ, ఫిన్‌టెక్, అంతరిక్షం, డ్రోన్లు, మొబిలిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం సరఫరా వ్యవస్థలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సాంకేతిక పోటీ తీవ్రరూపం దాల్చింది. ఇంధన భద్రత, వాతావరణ పరిరక్షణ వంటి అంశాలు సవాళ్లుగా మారాయి. ఇలాంటి సమయంలో భారత్- యూరప్ కలిసి పనిచేస్తే స్థిరత్వం, సుస్థిరత, ఉమ్మడి అభివృద్ధికి మార్గం సుగమమవుతుంది. ఈ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని మీ అందరినీ భారత్ ఆహ్వానిస్తోంది' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## చోళుల వారసత్వ సంపద మళ్లీ భారత్‌కు..

### 1వ శతాబ్దపు చోళ వంశానికి చెందిన రాగి శాసనాలు నెదర్లాండ్స్ నుండి తిరిగి త్వరలో భారతదేశానికి భారత్ కు తీసుకోవస్తున్నట్లు ప్రకటించిన ప్రధాని



నెదర్లాండ్ ప్రభుత్వం మన భారతదేశానికి చెందిన 11వ శతాబ్దపు చోళుల రాగి శాసనాలను తిరిగి అప్పగించింది. ప్రధాని రాబ్ జెట్టెన్ సమక్షంలో ఈ శాసనాలను అప్పగించారు. దీంతో భారత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే ప్రయత్నాలలో ఇది ఒక కీలకమైన మైలురాయిగా మారింది. భారతదేశానికి చెందిన ఈ చోళ రాజవంశ శాసనాలు నెదర్లాండ్స్‌లోని లైడెన్ విశ్వవిద్యాలయంలో చేరడానికి వెనుక ఒక ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది. విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఎక్స్ లో కొన్ని ఫొటోలు షేర్ చేశారు. 'ప్రతి భారతీయుడికీ ఇది ఎంతో సంతోషకరమైన క్షణం. చోళ రాజవంశానికి చెందిన రాగి పలకలు (రాగి శాసనాలు) నెదర్లాండ్స్ నుండి భారత్‌కు తిరిగి రానున్నాయి. ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో, నేను ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను. ఈ చోళ కాపర్ ప్లేట్లు మొత్తం 24 ప్లేట్ల సెట్ ఉండగా, ఇందులో 21 పెద్ద, 3 చిన్న ప్లేట్లు ఉన్నాయి. వీటిపై ప్రపంచంలోని అత్యంత అందమైన భాషలలో ఒకటైన తమిళ భాషలో వ్యాసాలు రాశారు. ఈ పత్రాలు గ్రేట్ కింగ్ రాజేంద్ర చోళ 1 కాలం నాటివి. ఆయన తన తండ్రి అయిన రాజు రాజరాజ 1 చేసిన ఒక మౌఖిక వాగ్దానానికి అధికారిక రూపం ఇచ్చారు.' 'ఇవి చోళుల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. భారతీయులు చోళులు, వారి సంస్కృతి, వారి నౌకాదళ శక్తి గురించి ఎంతో గర్విస్తాం. నెదర్లాండ్స్ ప్రభుత్వానికి, ప్రత్యేకించి 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ తామ్రపత్రాలను భద్రపరిచిన లైడెన్ యైనివర్సిటీకి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రాగి ప్లేట్లు 100 సంవత్సరాలకు పైగా నెదర్లాండ్స్ వద్ద ఉన్నాయని' ప్రధాని మోదీ తెలిపారు.విశ్వసనీయమైన, పారదర్శకమైన, మెరుగైన భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న సప్లై చైన్‌ను నిర్మించడానికి భారత్, నెదర్లాండ్స్ కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'ఇంధన భద్రత నుండి నీటి సంరక్షణ వరకు, నెదర్లాండ్స్, భారత్ కలిసి పనిచేస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్‌పై మన సహకారం చాలా ముఖ్యం. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని' అన్నారు.నెదర్లాండ్స్ ట్యులిప్స్ కు ప్రసిద్ధి చెందిన విషయాన్ని ప్రస్తావించారు. భారత్ తామర (కమలం) కు ప్రసిద్ధి చెందిందని మోదీ అన్నారు. 'ట్యులిప్, కమలం రెండూ మనకు చాలా విషయాలు నేర్పుతాయి. వేర్లు నీటిలో ఉన్నా లేదా భూమిలో ఉన్నా, రెండూ అందాన్ని, శక్తిని పొందుతాయి. భారత్, నెదర్లాండ్స్ అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేసుకుంటాయి. ప్రపంచ ప్రాజెక్టులను సాధించడానికి రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని' అన్నారు. కాలక్రమేణా అనేక నాగరికతలు అంతరించిపోయాయని, కానీ భారత వైవిధ్యభరితమైన సంస్కృతి నేటికీ ఇక్కడి ప్రజల హృదయాలలో నిలిచి ఉందన్నారు.

# ఘనంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం మసీద్‌బండ, కొండాపూర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, యువత, అభిమానులు పాల్గొని రవికుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు పూలమాలలు, శాలువాలతో రవికుమార్ యాదవ్‌ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు, బ్యానర్లతో కళకళలాడింది. కార్యకర్తలు నినాదాలతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అలాగే యువతకు ప్రోత్సాహం అందిస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో రవికుమార్ యాదవ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుమ్మరుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం

## – రాష్ట్రవ్యాప్తంగా భారీ సభకు సన్నాహాలు



**సికింద్రాబాద్, మే 17 (సాక్ష్యం):** తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకత్వం నిర్ణయించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ కుమ్మర రాష్ట్ర, 33 జిల్లాల కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు మాట్లాడుతూ, కుమ్మర వర్గానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్ పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపగా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం 33 జిల్లాల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి భారీ బహిరంగ సభ నిర్వహణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని సూచించారు. సభ ప్రారంభ ఉపన్యాసాన్ని డాక్టర్ కంభంపాటి సత్యనారాయణ నిర్వహించగా, కార్యక్రమ నిర్వహణలో ప్రధాన కార్యదర్శి దయానంద్ పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. బహిరంగ సభ నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరుల సేకరణ బాధ్యతలను ఆమంచి రాజలింగంకు అప్పగించారు. సమావేశంలో కుమ్మర వర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక డిమాండ్లను తీర్మానించారు. రాష్ట్రంలో మట్టి పాత్రల ఉత్పత్తి కోసం ప్రభుత్వ సహకారంతో సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని, కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయి పాలకవర్గంతో రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు. అలాగే 33 జిల్లాల్లో వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన వృత్తిదారులకు నెలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కుమ్మరులను బీసీ–బి నుంచి బీసీ–ఏ జాబితాలో చేర్చాలని, ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించాలని, ప్లాస్టిక్ నిషేధంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కవయిత్రి మొల్ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమంలో బండారి భిక్షపతి, కే. లక్ష్మీనారాయణ, టీకే శ్రీనివాస్, చందర్ రావు, రామన్‌కోల్ వీరేశం, రామచంద్రయ్య, నాగపురి నాగేష్, శ్యామ్ కుమార్, రాచకొండ కృష్ణయ్య, గుండాల గోవర్ధన్, జిల్లల శంకర్, కుమ్మరి సాయిలు, ఈఎన్ అశోక్, నాంపల్లి శ్రీనివాస్, మల్లెల ఉషారాణి, ఏరుకొండ శ్రీనివాస్, ఎగిరిశెట్టి వీరయ్య, నడికుడి కృష్ణ, నిమ్మలూరి శ్రీనివాస్, కుమ్మరి వెంకటేష్, తోగరి రఘు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

# లాలాపేటలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహణ





**సికింద్రాబాద్, మే 17 (సాక్ష్యం):** ప్రజా ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ నాయకులు ఘర్ష మోహన్, ఘర్ష శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో లాలాపేట గడి స్కూల్‌లో ఘర్ష సాయిలు, నాగమణి జ్ఞాపకార్థం ఉప్పల్ టీఎక్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపు మరియు రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి డీసీ జ్యోతి, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వైద్య సేవలను చేరువ చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. అలాగే రక్తదాన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, ఘర్ష మోహన్ రావు, మాడా ప్రమోద్ కుమార్, ఆకుల సంపత్, ఘర్ష శ్రవణ్ కుమార్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# కేపీహెచ్ రెడ్డినగర్‌లో ప్రజా సమస్యలపై ముఖాముఖి సమావేశం

## – తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు: నెమలి అనిల్ కుమార్





**ఉప్పల్, మే 17 (సాక్ష్యం):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ముఖాముఖి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ హాజరై స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా సమస్య తీవ్రంగా ఉన్నట్లు పేర్కొంటూ, దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. అలాగే ప్రాంతంలో అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల అంశాలను కూడా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలపై స్పందించిన నెమలి అనిల్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సహాయ ఇంజనీర్ రోహిత్, మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, కేఎల్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకూబ్ రెడ్డి, మాణిక్య రెడ్డి, ప్రసాద్, రింకు, కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం



**భూపాల్ పల్లి మే 17 సాక్ష్యం న్యూస్** భూపాలపల్లి జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, ముఖ్యంగా దీ+–3 వంటి నిషేధిత విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో ఎవరైనా నిషేధిత విత్తనాలు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే ్రాణ ాూ్ష్ కింద కూడా చర్యలు తీసుకుని రెండేళ్ల వరకు జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాల అరికట్టటానికి ప్రతి మండలములో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువుల విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# భారతీయ నాగరికతలో దేశీయ గోవుల ప్రాధాన్యంపై హైదరాబాద్‌లో జాతీయ సదస్సు






**హైదరాబాద్, మే 17 (సాక్ష్యం):** భారతీయ నాగరికతలో దేశీయ గోవుల చారిత్రక, సాంస్కృతిక, శాస్త్రీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో "భారతీయ నాగరికతలో గోవు -- చరిత్ర, సంస్కృతి, వారసత్వం, శాస్త్రీయ మరియు ఆర్థిక దృక్కోణాలు" అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. భారతీయ ఇతిహాస సంకలన సమితి, హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలువురు విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సామాజికవేత్తలు హాజరయ్యారు. ఈ సదస్సులో దేశీయ గోవుల చారిత్రక, సాంస్కృతిక, శాస్త్రీయ, వ్యవసాయ, ఆర్థిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతపై విస్తృతంగా చర్చించారు. ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి రంగాల్లో గోవు ఆధారిత స్థిరమైన విధానాల ప్రాధాన్యాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర భారతీయ ఇతిహాస సంకలన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ వి. కిషన్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ గురుప్రసాద్ సింగ్, జాతీయ పాలాభివృద్ధి మండలి మాజీ డైరెక్టర్ పాల్గొని భారతీయ సంస్కృతి, దేశాభివృద్ధిలో దేశీయ పశువుల పాత్రపై ప్రసంగించారు. ప్రధాన ఉపన్యాసాన్ని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎం. రావు అందిస్తూ పంచగవ్యంపై జరుగుతున్న శాస్త్రీయ పరిశోధనలు, గోవు ఆధారిత వ్యవసాయ విధానాలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ జయతీర్థ రావు, పెకేటి ప్రసాద్, సీఏ జస్రాజ్‌జీ శ్రీశ్రీమాల్, గోస్వామి నిత్తల గోపాలకృష్ణ, సునీల్ మాన్సింగ్‌కా, డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, డాక్టర్ సురేష్ జకోటియా, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ శరద్ జహూర్కర్, మౌసమీ సింగ్, అరుణ జ్యోతి, అనిల్ కుమార్, విజయ రామారావు తదితరులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ాార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా సాయి ప్రసాద్ బృందం ప్రదర్శించిన "మునుసూరి నాయకులు" చారిత్రక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సదస్సు విజయవంతానికి సహకరించిన సదస్సు అధ్యక్షులు శ్రీ సాయి వరప్రసాద్, ప్రొఫెసర్ పి. జలపతి, ఎం. ఇందు శేఖర్, యాదగిరి రావు, ఏ. కేశవరాజ్, లక్ష్మి, డాక్టర్ కవిత, సరస్వతి తదితరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. దేశీయ గోవుల పరిరక్షణ, భారతీయ జ్ఞాన వ్యవస్థల ప్రాచుర్యానికి సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ సదస్సు ముగిసింది.

# "పాలమూరుకు నీళ్లు కావాలి: రాజకీయాలు కాదు"

## – పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి జేఏసీ గళం – డిండి లిఫ్ట్ రద్దు చేసి జీఓ 72 అమలు చేయాలని డిమాండ్




**మహబూబ్‌నగర్, మే 17 (సాక్ష్యం బ్యూరో):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. "పాలమూరుకు నీళ్లు కావాలి... రాజకీయాలు కాదు" అనే నినాదంతో జేఏసీ నేతలు సాగునీటి సమస్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ ఎస్. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధుల వరద పారించి వేగంగా పూర్తి చేయాలని కోరారు. 72 జీఓ ప్రకారం పాత డిజైన్‌లోనే పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తికాకపోవడం ఎవరి పాపమో ప్రజలు ఆలోచించాలని వ్యాఖ్యానించారు. డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీటి తరలింపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది. పాలమూరు--రంగారెడ్డి లిఫ్ట్ నీటిని మళ్లించడం వల్ల మహబూబ్‌నగర్, రంగారెడ్డి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించింది. దీనికి బదులుగా నాగార్జునసాగర్--గొట్టిముక్కుల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి గొట్టిముక్కుల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీరు అందించాలని కోరింది. తెలంగాణ ఉద్యమ సమయంలో "నీళ్లు--నిధులు--నియామకాలు" ప్రధాన నినాదాలుగా నిలిచినా, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా పాలమూరు రైతాంగానికి సాగునీటి న్యాయం జరగలేదని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్నప్పటికీ మహబూబ్‌నగర్‌కు సరైన నీటి వాటా దక్కలేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పార్టీలకు అతీతంగా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని జేఏసీ సూచించింది. ప్రాజెక్టులపై బీఆర్ఎస్ పాదయాత్ర చేస్తే అభ్యంతరం లేదని, అయితే డిండికి నీటి తరలింపును అడ్డుకోవాలనే నినాదంతో ఉద్యమం జరగాలని పేర్కొంది. అసంపూర్తి ప్రాజెక్టులపై కూడా జేఏసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కల్వకుర్తి లిఫ్ట్‌లో పూర్తి స్థాయిలో నీటి ఎత్తిపోతలు జరగడం లేదని, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఇంకా పూర్తి కాలేదని తెలిపింది. నెట్టెంపాడు, భీమా--1, భీమా--2, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు లక్ష్యాలను చేరుకోలేకపోయాయని విమర్శించింది. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దక్షిణ తెలంగాణ సాగునీటి నోడల్ పాయింట్‌గా అభివృద్ధి చేయాలని జేఏసీ ప్రతిపాదించింది. ప్రాణహిత--చేవెళ్ల ద్వారా గోదావరి నీటిని తీసుకురావడంతో పాటు జూరాల వరదనీటిని లిఫ్ట్ చేసి లక్ష్మీదేవిపల్లికి తరలించాలని సూచించింది. రాష్ట్రంలో సాగునీటి పంపిణీలో తీవ్ర అసమానతలు ఉన్నాయని పేర్కొంటూ ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోతున్న రైతులకు కేవలం పరిహారం కాకుండా సాగుభూమి కూడా ఇవ్వాలని అభిప్రాయపడింది. చివరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు సాగునీటి చరిత్రను మార్చే అవకాశం ఉన్న నాయకుడిగా నిలవాలని, ప్రత్యేక కార్యాచరణతో అన్ని పెండింగ్ ప్రాజెక్టులను కాలపరిమితిలో పూర్తి చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి

## – వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్







**హనుమకొండ 17 మే (సాక్ష్యం)** యువత మత్తు పదార్థాలకు జోలికి పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సిసి కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై జాగృతి కళాబృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారం మారుతుందని, ఎవరైనా డ్రగ్స్ విక్రయించిన, వినియోగించిన పోలీసులకు సమాచారం అందించాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేనంకోవద్దని, సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తం వుండాలని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని, రాష్ట్రంలో మహిళల భద్రత కోసం షీ టీం ఏర్పాటు చేయబడిందని, నేరాల నియంత్రణ కోసం ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాణించిన విద్యార్థులను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత ఏసీపీ లు జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ మహేందర్, ఎస్.ఐలు దేవేందర్, రవితో పాటు డాక్టర్లు ప్రహసీత్, ప్రశాంత్, సామాజిక వేత్త ఆచార్య హసన్ పర్తి మండల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

## యాదాద్రి పుణ్యక్షేత్రంలో విశేష పూజలు

– భక్తులతో కిటకిట లాడిన యాదాద్రి





**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..** పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో అదివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వరుస సెలవులు ఆదివారం సెలవురోజు కావడంతోయాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే తమ కుటుంబ సభ్యులతో క్యూలైన్ల లో బారులు తీరిన భక్తులు..భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ మాడవీధులు,కళ్యాణకట్ట, పుష్కరిణి, వ్రత మండపం, వాహనాల పార్కింగ్, ఘాట్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ధర్మ దర్శనం. రెండున్నర గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనం. గంటన్నర సమయం పడుతోంది...వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. భక్తులు తమ కుటుంబీకులతో కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు. పలువురు తలనీలాలు సమర్పించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వివిధ కైంకర్యాలలో 52,63,697/- ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...** రాజపేట మండలం రఘునాథపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామ శివారులోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2001 2002 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన టీచర్లను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం వేదిక పైన ఉపాధ్యాయులు ఆసీనులై నాటి జ్ఞాపకాలు తెలియజేశారు. దీంతో పాటుగా పలువురు విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో బైరా రాజశేఖర్, బల్ల రాజు, బేటి శ్రవణ్ కుమార్, భేటీ రవికుమార్, శ్రీనివాస్, జి. చంద్రశేఖర్, యాదగిరి, రాజేశ్వర్, బలరాం, ఆనంద్, మిరియాల అన్నపూర్ణ, చంద్రకళ, ప్రసన్న, బాలజ్యోతి, ధనుంజయ, శ్రీకాంత్, వెంకటేష్, సురేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...**తమపై అకారణంగా దాడి చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పాత గుండ్లపల్లి గ్రామ నాయకులు తాళ్ల లక్ష్మారెడ్డి, తాళ్ల భాస్కర్ రెడ్డి తదితరులు కోరారు. పాత గుండ్లపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఒక ఊరేగింపు విగ్రహాన్ని వేరేచోట పెట్టాలని తాము భావిస్తే ఒక నాయకుడు తన వెంట కొంతమందిని తీసుకొని వచ్చి తమను దుర్భాషలాడుతూ తమపై దాడి చేశారని ఆరోపించారు. అకారణంగా తమపై దుర్భాషలాడుతూ తమపై దాడికి దిగిన ఆ నాయకుడు పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వీరు అన్నారు. ఈ మేరకు వీరు పాతగుండ్లపల్లి హనుమాన్ దేవాలయం ఆవరణలో స్థానిక గ్రామ ప్రజలు పెద్ద మనుషులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో స్థానిక పెద్దమనుషులు, నాయకులు, ఆలయ కమిటీ శాశ్వత సభ్యులు, గడ్డమీది నారాయణ, టి. మధుసూదన్ రెడ్డి, టి. రామ్ రెడ్డి, అధ్యక్షులు కొన్యాల నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు తాడూరి కృష్ణ, సూదగాని గోపాల్, టి లక్ష్మారెడ్డి, టి. రాజశేఖర్ రెడ్డి, టి. భాస్కర్ రెడ్డి, తాడూరి పాండు, సుధా గాని శ్రీను, ఎర్ర యశ్వంత్ రెడ్డి, శివరాత్రి పోచయ్య, శివరాత్రి కుమార్, పల్లపు మహేష్, కొన్యాల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాగి వాహనాలు నడిపినట్లయితే చట్టపరంగా చర్యలు

– గుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...** ఆదివారం రోజు యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరిగింది. ఈ టెస్టుల నందు ఐదు మంది వాహనదారులు డ్రింక్ చేసి వాహనం నడపడం వల్ల వారిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరిగింది. వీరిని కోర్టులో హాజరుపరచుటకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. తాగి వాహనాలు నడిపినట్లైతే కచ్చితంగా చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయి. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ, ఎస్సైలు దేవేందర్, రాజు కానిస్టేబుళ్లు కోటి,నితిన్, శ్రీనివాస్ రెడ్డి, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యతోనే మహిళల సాధికారత సాధ్యం

– ఎన్టీఆర్ మహిళా కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం




**మహబూబ్‌నగర్, మే 17 ( సాక్ష్యం బ్యూరో):** ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబ్‌నగర్ మేయర్ మమత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తూ దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. అలాగే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రతి రంగంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వారోత్సవాలను నిర్వహించిందన్నారు. మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పన కోసం డిగ్రీ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని వివరించారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ క్రీడాకారిణులను సన్మానించారు. అలాగే దేశ్ పాండే ఫౌండేషన్ ద్వారా వివిధ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు సాధించిన విద్యార్థినులను అభినందించి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులు మీనాక్షి, స్నేహ ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. మహిళా సాధికారతపై ఎన్‌సీసీ విద్యార్థినులు ప్రదర్శించిన నాటికతో పాటు తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కన్వీనర్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ అనురాధ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ లక్ష్మీనరసింహారావు, మద్దిలేటి, డాక్టర్ మార్కండేయ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

- 45 వేల గన్నీ సంచుల పంపిణీ – అదనపు లారీలు, ట్రాక్టర్ల ఏర్పాటు



**మహబూబ్‌నగర్, మే 17 ( సాక్ష్యం బ్యూరో )** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో పి.పి.సి కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాల రవాణా కోసం అదనపు లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తరలింపును వేగవంతం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గన్నీ సంచుల సరఫరా, హమాలీల నియామకం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 45 వేల గన్నీ సంచులను సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ ఆదివారం జడ్చర్ల కాటన్ మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, గన్నీ సంచులు సమృద్ధిగా నిల్వ ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంటనే సమీప గోదాములకు తరలించేలా లారీలు, ట్రాక్టర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రసీదులు అందజేసి ఒపిఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.యం రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్‌తో కలిసి అడ్డాకుల మండలంలోని బాలీద్‌పల్లి, కన్మనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను వెంటనే ట్రాక్టర్ల ద్వారా తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కన్మనూర్ కేంద్రానికి ఆర్టీవో శాఖ ద్వారా ప్రత్యేకంగా ఒక లారీని ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టారు. అలాగే మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు అదనపు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని అడ్డాకుల ఎ.పి.యంను ఆదేశించారు. రవాణా వాహనాల కొరతను అధిగమించేందుకు మహబూబ్‌నగర్ నుంచి ఏడు లారీలు, అడ్డాకుల చెక్‌పోస్ట్ నుంచి ఐదు లారీలను సమీకరించి సమీప కొనుగోలు కేంద్రాలకు పంపించారు. గన్నీ సంచుల కొరతను నివారించేందుకు వేముల, నందిపేట్, కొమిరెడ్డిపల్లి, భూత్పూర్, మద్దిగట్ల, కరివేన, జనంపేట్, పొన్నకల్, బాలీద్‌పల్లి కేంద్రాలకు తలా ఐదు వేల గన్నీ సంచులను సరఫరా చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, సైకిళ్ళు పంపిణీ






**ఏటూరునాగారం, మే17, (సాక్ష్యం) :** సమాజంలో వెనుకబడిన వర్గాల, నిరుపేదల కష్టాలను చూసి చలించిపోయే గుణం అందరికీ ఉండదు. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగిన అడవి బిడ్డలు, ఏజెన్సీ ప్రాంతాల ప్రజల కన్నీళ్లను తూడ్చేందుకు నేనున్నానంటూ ముందుకొచ్చే నాయకులే నిజమైన ప్రజా సేవకులు. ఆ కోవకు చెందిన వారే ప్రముఖ సామాజిక సేవకులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు సమాజ సేవను ఒక బాధ్యతగా స్వీకరించి, సేవా సంస్థలను ఏజెన్సీ ముంగిట నిలబెట్టిన ఆయన కృషి అమోఘం.

**100 సైకిళ్ళు, 60 కుట్టుమిషన్లు పంపిణీ**

ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఆవరణంలో జిల్లా బీఆరెస్ పార్టీ అధ్యక్షులు కాకులమరి లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన రోటరీ క్లబ్ సేవా యజ్ఞం ఆదివారం నిర్వహించడం జరిగింది. ప్రముఖ అంతర్జాతీయ సేవా సంస్థలైన హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ మరియు హన్మకొండ రోటరీ క్లబ్ బిజీ ఆర్ మైనింగ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ లను సమన్వయం చేస్తూ, ఏజెన్సీ ప్రాంతాల్లోని అర్హులకు కొండంత అండగా నిలిచారు. ఈ కార్యక్రమం కేవలం ఒక పంపిణీ వేడుకలా కాకుండా, వందలాది కుటుంబాలలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా సాగింది. చదువుకు 'సైకిల్' వారధి మారుమూల గ్రామాల నుండి పాఠశాలలకు వెళ్ళడానికి రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న 100 మంది నిరుపేద విద్యార్థి, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఇది వారి ఉన్నత చదువులకు ఎంతగానో దోహద పడుతుంది. అలాగే మహిళా సాధికారతకు 'కుట్టు మిషన్లు'గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలు, యువతులు స్వయం ఉపాధి పొంది, తమ కాళ్ళ మీద తాము నిలబడేలా 60 కుట్టు మిషన్లను ఉచితంగా అందజేశారు. ఇది వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి నాంది పలికిందని చెప్పవచ్చు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఏటూరు నాగారం గ్రామానికి చెందిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, శ్రీలత, ప్రదీప్ రావు, ప్రవీణ్ రావుల సేవా దృక్పథంతో ఏజెన్సీ గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ముఖ్య ధ్యేయమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఏటూరునాగారం, ములుగు జిల్లాకు మా రోటరీ క్లబ్ ద్వారా పేద ప్రజలకు అవసరమైన కార్యక్రమాలను కాకులమర్రి శ్రీలత, లక్ష్మణ్ బాబు ద్వారా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. కాకుల మర్రి లక్ష్మణ్ బాబు లాంటి నిబద్ధత కలిగిన వ్యక్తి వల్లే తాము ఈ మారుమూల ప్రాంతాలకు చేరగలిగామని రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు కాకులమర్రి బ్రదర్స్ లక్ష్మణ్ బాబు, ప్రదీప్ రావు, ప్రవీణ్ రావు ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ వారు నిర్వహిస్తామని కాకులమర్రి అన్నదమ్ములను కొనియాడారు. ములుగు జిల్లా ప్రగతికి లక్ష్మణ్ బాబు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పడం జరిగింది , కేవలం ఈ ఒక్క కార్యక్రమంతోనే ఆగిపోకుండా, ములుగు జిల్లా వ్యాప్తంగా రోటరీ క్లబ్ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సంకల్పించారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని మరిన్ని వెనుకబడిన గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, పేదరిక నిర్మూలనకు రోటరీ క్లబ్ మద్దతుతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఆధ్వర్యంలో ప్రకటించడం విశేషం.

**పేద ప్రజల పక్షపాతి -- లక్ష్మణ్ బాబు:**

"నిజమైన సేవ అంటే అధికారంలో ఉన్నప్పుడు చేయడం కాదు ప్రజల కష్టాలను చూసి హృదయం ద్రవించి స్వచ్ఛందంగా ముందుకు రావడం." ఈ మాటలకు లక్ష్మణ్ బాబు నిలువెత్తు రూపం. పేద ప్రజల స్థితిగతులను, వారి దైన్య స్థితిని కళ్లారా చూసి, వారికి శాశ్వత ప్రాతిపదికన సహాయం అందించాలనే తపన ఆయనలో స్పష్టంగా కనిపిస్తోంది. పెద్దమనిషిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, చూపిస్తున్న చొరవ ములుగు జిల్లా ప్రజల గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టాయి. ధనవంతులు చాలా మంది ఉంటారు, కానీ సమాజానికి ఖర్చు పెట్టే గుణం కొందరికే ఉంటుంది. సామాజిక బాధ్యతను గుర్తించి రోటరీ క్లబ్ వంటి సంస్థలను ఏజెన్సీ ప్రాంతానికి రప్పించి, విద్యార్థులకు, మహిళలకు కొండంత భరోసా ఇచ్చిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు సేవలు భవిష్యత్తులో కూడా ఆయన ఆధ్వర్యంలో ములుగు జిల్లా మరిన్ని సేవా ఫలాలను అందుకొని, ఆదర్శంగా నిలవాలని ఆశిస్తూ ఆయన సేవా ప్రస్థానం నిరంతరం కొనసాగాలని ప్రజలంతా మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శరత్ బాబు, ప్రభాకర్, శ్యామ్ పాటిబండ్ల, సందేశాని నరేష్, బేతి రవీందర్ రెడ్డి, జూబ్లీహిల్స్ క్లబ్ ప్రెసిడెంట్ కళ్యాణ్, బి జి ఆర్ మైనింగ్ డైరెక్టర్ బాలకోటి రెడ్డి, లక్ష్మి జ్యోతి రెడ్డి, వంగరాజీ రెడ్డి, గంగోజుల నరేష్, అంచులు విజయకుమార్, మిరియాల రాజ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎప్సెట్ - 2026లో రిషి కళాశాల ఘన విజయం

– పాలమూరు విద్యారంగంలో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించిన రిషి



**మహబూబ్‌నగర్, మే 17 ( సాక్ష్యం బ్యూరో )** పాలమూరు విద్యారంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగుతున్న రిషి జూనియర్ కళాశాల, ఎప్సెట్ - 2026 ఫలితాలలో మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని నమోదు చేసింది. రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత ర్యాంకుల దిశగా నడిపిస్తున్న రిషి విద్యాసంస్థలు ఈ ఏడాది కూడా అద్భుత ఫలితాలతో పాలమూరు జిల్లాకు గర్వకారణంగా నిలిచాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 1000 లోపు 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. సమీరా బేగం రాష్ట్ర స్థాయిలో 180వ ర్యాంకు సాధించగా, అమూల్య 221, నందిని రెడ్డి 348, మనస్విత 404, నుజత్ 446, హప్స మోహిన్ 457, మాలిహ తహసీయత్ 684, భావన 723, అదిబా మైహిన్ 725, ప్రసన్న లక్ష్మి 895, సాయి శ్రీ 1000వ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. రూపశ్రీ 1006వ ర్యాంకు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో కూడా రిషి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కిరణ్ 1109, నరహరి 1213, సయ్యద్ మిస్బవుద్దీన్ 1801, కిషోర్ కుమార్ 1951, సంతోష్ 2456, జ్యోతిర్నాథ్ 2513 రాష్ట్ర ర్యాంకులు సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచారు. అదనంగా అనేక మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, చైర్‌పర్సన్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, చైర్‌పర్సన్ చంద్రకళ ప్రత్యేకంగా అభినందించి వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ భూపాల్ రెడ్డి, అకాడమిక్ డీన్ కళ్యాణ్ బాబు, ప్రిన్సిపల్స్ రాఘవేంద్రరావు, వెంకటరత్నం, ప్రసన్న, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి



చౌటుప్పల్ మే 17 (సాక్ష్యం) రాంగ్‌రూట్‌లో వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పెట్రోల్ బంక్ ఉద్యోగి మృతి చెందిన ఘటన చౌటుప్పల్ మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చౌటుప్పల్ కు చెందిన అన్నెబోయిన మల్లేష్ (45) హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం డ్యూటీ ముగించుకొని తన సీబీజెడ్ బైక్ (ఏపీ13 ఎం 4987)పై తూప్రాన్‌పేట్ నుంచి చౌటుప్పల్‌లోని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఖైతాపురం స్టేజి సమీపంలోని ఎన్హెచ్-65 హైవేపై ఉదయం సుమారు 11 గంటల సమయంలో రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేష్ రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రి వర్గాలు అనంతరం మెరుగైన చికిత్స కోసం చింతలకుంటలోని నాసా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మల్లేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య అన్నెబోయిన అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. మన్మధకుమార్ తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

– సర్పంచ్ శ్రీలత



ఏటూరునాగారం, మే 17, (సాక్ష్యం) : ఏటూరునాగారం మేజరు గ్రామ పంచాయితీ సర్పంచ్ కాకులమరి శ్రీలత గ్రామంలోని చేపలు, మటన్, చికెన్ వ్యాపార సముదాయ పరిసరాలను ఆదివారం పరిశీలించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయితీగా మార్చాలంటే మొదట మన పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరు బాద్యతగా తీసుకోవాలని వ్యాపారులతో అన్నారు. మటన్ దుకాణ దారులు పశు వైద్యాధికారులచే నమోదు చేయబడిన మేకలు, గొర్రెల మటన్ నే విక్రయించాలి అలా జరగడం లేదని ఎవరైనా పిర్యాదులు చేస్తే చర్యలు తీసుకోబడతాయని సర్పంచ్ అన్నారు. అంతేకాకుండా చేపల మార్కెట్ వద్దనున్న చేపల కళేబరాలను అక్కడ వస్తున్న దుర్వాసనను పరిశీలించి అలా చెత్త వేయకుండా శుభ్రంగా ఉండేల చూడాలని, లేదంటే పంచాయితీ కార్మికుల సహాయంతో పని చేయించుకోండి అంటూ వ్యాపారులకు సూచించారు. పంచాయితీ కార్మికులు మా మాట వినడం లేదని వ్యాపారులు సర్తంచ్ కు తెలపడంతో కార్మికులతో మాట్లాడి చేయిస్తానని సర్పంచ్ శ్రీలత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జిల్లా బీఆరెస్ పార్టీ అధ్యక్షులు కాకులమరి లక్ష్మీనర్సింహారావు, వార్డు సభ్యులు ఉన్నారు.

## వారం రోజులు నిప్పుల కుంపటే..

10.30 నుంచి 4 గంటల్లోపు బయటికి వెళ్లొద్దన్న వాతావరణ శాఖ



హైదరాబాద్ మే 17 (సాక్ష్యం) తెలంగాణలో రానున్న రోజుల్లో భారీగా భానుడి ప్రతాపం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. వారం రోజుల పాటు నిప్పుల కుంపటిలా ఉంటుందని తెలిపారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నమోదవుతాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. తెలంగాణలో వచ్చే వచ్చే వారం రోజుల పాటు ఎండలు తారెత్తించనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. తీవ్ర వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. సగటున 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వివరించింది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. తీవ్ర వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. సగటున 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వివరించింది. మధ్యాహ్నం సమయంలో భీకరమైన ఎండలు ఉంటాయని.. అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని సూచించింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటికి వెళ్లొద్దని పేర్కొంటున్నారు. ఇక ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల ప్రతాపం మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కుమురం భీం, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల వంటి జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇక రాష్ట్రంలోని 16 జిల్లాలకు ఎండల తీవ్రత దృష్ట్యా ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. సోమవారం రోజున రాష్ట్రంలోని 7 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. రవీందర్ నాయక్ హెల్త్ అడ్వైజరీ జారీ చేశారు. దాహం వేయకపోయినా నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగాలని సూచిస్తున్నారు. బయటికి వెళ్లినపుడు తప్పకుండా తాగునీటిని వెంట ఉంచుకోవాలని తెలిపారు. పుచ్చకాయ, కీరదోస లాంటి నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లు తినాలని పేర్కొంటున్నారు. తేలికగా ఉండే నూలు దుస్తులు ధరించడంతో పాటు బయటికి.. వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ తప్పనిసరిగా వాడాలని తెలిపారు. మద్యం, టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్‌తో పాటు ఎక్కువ ఉప్పు, కారం, మసాలాలు ఉండే ఆహారాలు తినొద్దని, తాగొద్దని పేర్కొన్నారు. వాంతులు, వికారం, చర్మం పొడిబారడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఎండల దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో బెడ్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను రెడీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు స్పష్టం చేశారు.

## పెట్రోల్, డీజిల్, ధరల పెంపుతో ప్రజలపై పెను భారం మోపుతున్న మోడీ సర్కార్

– సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు – ఎండి పాషా



చౌటుప్పల్ మే 17 (సాక్ష్యం) దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో మోడీ సర్కార్ ప్రజలకు పెను భారం మోపుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా అన్నారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని బస్టాండ్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ ఎదురు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, ధరలను పెంచి ప్రజల ను మరోసారి మోసం చేసిందని అన్నారు. డీజిల్, పెట్రోల్, ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం. అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు దాటగానే మూడు రూపాయలకు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం మోడీ అబద్ధాలు చెబుతున్నారని ఇది విశ్వాస ఘాతకం, అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, కొండే శ్రీశైలం, బోయి యాదయ్య, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, భావండ్లపల్లి స్వామి, యాట బాలరాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి రహీం, శాలయ్య, భీమగోని బాలరాజు, యాట ముత్యాలు, వల్లూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## వేద పాఠశాల శంకుస్థాపనకు రాష్ట్ర సీఎంకు ఆహ్వానం

– ఆహ్వానం పలికిన దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు



యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు ప్రతిష్టాత్మకముగా నిర్మింపబడు వేద పాఠశాలకు మే 23 రోజున దేవస్థానం నందు టెంపుల్ సిటీ ప్రాంగణంలో శ్రీ కంచి పీఠాధిపతులవారి దివ్య మంగళ శాసనములతో నిర్వహింపబడు భూమి పూజకు విచ్చేయవలసినదిగా ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ని దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ, భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య వారి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ, దేవస్థానం తరపున ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీమతి శైలజ రామయ్యర్ దేవాదాయశాఖ కమిషనర్ వి. హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి భవాని శంకర్ క్యాంపు కార్యాలయం నందు కలిసి ఆహ్వానించడం జరిగినది. ఈ సందర్భంగా శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందజేయడం జరిగినది. ముఖ్యమంత్రివర్యులు వారలకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీ స్వామివారి లడ్డు ప్రసాదం అందజేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, దేవస్థాన అనువంశిక ధర్మకర్త భాస్కర్ ఆయన నరసింహమూర్తి, దేవస్థాన ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, శివాలయం ప్రధాన అర్చకులు గౌరీభట్ల నరసింహ రాములు, వేద పండితులు పాల్గొన్నారు.

## పండగ పూట పరీక్షలు వద్దు ఓయూ డిగ్రీ ఎగ్జామ్స్ వాయిదా చేయండి



హైదరాబాద్ మే 17 (సాక్ష్యం) ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మే 28న జరగాల్సిన బీఏ, బీకామ్, బీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్‌లను కోరారు. ఆ రోజు ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ కావడమే ఇందుకు కారణం. పండుగ రోజున పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ పరీక్షలను మరో తేదీకి రీషెడ్యూల్ చేయాలని ఓవైసీ తన ట్వీట్‌లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మే 28న ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన పలు డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలని హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఆ రోజు ముస్లింల పవిత్ర పండుగ ఈద్ అల్-అధా (బక్రీద్) కావడంతో అదే రోజున పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావులను ఆయన ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. మే 28న ఓయూ పరిధిలో కీలకమైన బీకామ్, బీఎస్సీ, బీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగో, ఆరవ సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. ముఖ్యంగా బీకామ్ 4వ సెమిస్టర్ బిజినెస్ స్టాటిస్టిక్స్, 6వ సెమిస్టర్ అకౌంటింగ్ స్టాండర్డ్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల పరీక్షలు ఆ రోజు షెడ్యూల్ అయ్యాయి. పండుగ రోజున పరీక్షలు రాయడం వల్ల ముస్లిం విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారని, వారు నష్టపోయే ప్రమాదం ఉందని ఓవైసీ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్షలను మరొక అనుకూలమైన తేదీకి వాయిదా వేయాలని ఆయన కోరారు. ఈ రిక్వెస్ట్‌పై యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. తెలంగాణ ఎప్‌సెట్-2026 ఫలితాలు విడుదల తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష జూూాజజు- 2026 ఫలితాలు ఆదివారం జేఎన్‌టీయూహెచ్‌లో విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్‌టీయూహెచ్ వీసీ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డిలతో కలిసి ఈ ఫలితాల సీడీ, పాస్‌వర్డ్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ఫలితాల్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో తొలిసారిగా ఒక అమ్మాయి ప్రథమ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించింది. మేడ్చల్ జిల్లా ఉప్పల్ ప్రాంతానికి చెందిన మల్లాడి రుషి 160 మార్కులకు గాను 156.63 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు దక్కించుకుంది. సాధారణంగా మెడికల్, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగాల్లో అమ్మాయిలే ఎక్కువసార్లు ప్రథమ ర్యాంకులు సాధిస్తుండగా.. ఈసారి అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో అబ్బాయి టాప్ ర్యాంకు దక్కించుకున్నాడు. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన ముఖరం అహ్మద్ 150.17 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. మొత్తంగా ఇంజినీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్‌లో 86.27 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

## ఎఫ్‌సెట్‌లో మెరిసిన రేస్ విద్యార్థులు

– అద్భుత ఫలితాలతో రేస్ కాలేజీకి రాష్ట్రస్థాయి గుర్తింపు

– రికార్డు స్థాయిలో క్వాలిఫై అయిన రేస్ విద్యార్థులు





కోదాడ మే 17, (సాక్ష్యం) ఎఫ్‌సెట్ ఫలితాలలో రేస్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి స్టేట్ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన మొక్కా చరణ్ సాయి 380, ఐ. కృష్ణ చరణ్ 440, సిహెచ్ భాను శంకర్ 1775, డి విజయ్ చరణ్ 2135, సిహెచ్ ఉత్తేజ్ 5231, లేఖనా రెడ్డి 6749, కురువ నవీన్ 7354, వంగవీటి అక్షయ8462,వెంకటదత్త కిరణ్ 9748 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాణాల వసంత రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, కాలేజీ నుంచి రికార్డు స్థాయిలో విద్యార్థులు క్వాలిఫై అయ్యారని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పద్మజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడిగా బడుగు కైలాసం



చౌటుప్పల్ మే 17 (సాక్ష్యం) చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని పద్మజ్యోతి యువజన సంఘం నూతన కమిటీని సంఘం యొక్క సర్వ సభ్యులు కలిసి ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడి గా బడుగు కైలాసం, ఉపాధ్యక్షులుగా రచ్చ వెంకటేశం, కార్యదర్శిగా వర్కాల రాజు, కోశాధికారిగా వనం సురేందర్, క్రీడల కార్యదర్శిగా పొట్టబత్తిని ఆనంద్, సంస్కృతిక కార్యదర్శిగా జెల్లా ఆనంద్, గ్రంథాలయ కార్యదర్శిగా కుడికాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బీమనపల్లి శేఖర్, కైరంకొండ పాండు, బోనగిరి శ్రీనాథ్, గడ్డం గిరీష్, వడ్డేపల్లి సతీష్, సూరెపల్లి సంతోష్ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్, గడ్డం నర్సింహ, మాచర్ల కృష్ణ, సంగ సభ్యులు తదిదరులు పాల్గొన్నారు.

## సీఐ మహేందర్‌ను సన్మానించిన బీఆర్ఎస్ యూత్ నాయకులు



హనుమకొండ 17 మే (సాక్ష్యం) హన్మకొండ జిల్లా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ కు నూతనంగా విచ్చేసిన సీఐ ఎ మహేందర్ ను బీఆర్ఎస్ యూత్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈవేరకు సీఐకి పూల బోకేను అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ సమస్యనైనా తక్షణవే తన దృష్టికి తీసుకు వచ్చినట్లైతే, పరిష్కారానికి కృషి చేస్తానని యూత్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు బొర్ర సురేష్, చిట్యాల కమలాకర్, మంద క్రాంతి కుమార్, మద్దెల తిరుపతి, వస్కుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ప్లే ఆఫ్స్ చేరిన తొలి జట్టుగా ఆర్సీబీ

ఐపీఎల్ 2026 సీజన్ లో ప్లే ఆఫ్స్ కు చేరిన తొలి జట్టుగా డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘనత వహించింది.

ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్ లో గతేడాది రన్నరప్ పంజాబ్ కింగ్స్ పై 23 పరుగులతో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. దీంతో 18 పాయింట్లతో నాకౌట్ బెర్తును దక్కించుకుంది. ఇక ధర్మశాలలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. ఆల్ రౌండర్ వెంకటేష్ అయ్యర్ స్టన్నింగ్ ఫిఫ్టీ (40 బంతుల్లో 73 నాటౌట్, 8 ఫోర్లు, 4 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో హర్ ప్రీత్ బ్రార్ కు రెండు వికెట్లు దక్కాయి. ఛేజింగ్ లో ఓవర్లన్నీ ఆడిన పంజాబ్ కింగ్స్ 8 వికెట్లకు 199 పరుగులు మాత్రమే చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ శశాంక్ విధ్వంసక ఫిఫ్టీ (27 బంతుల్లో 56, 4 ఫోర్లు, 4 సిక్సర్లు ) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. రసిక్ సలామ్ కు 3, భువనేశ్వర్ కుమార్ కు రెండు వికెట్లు దక్కాయి. ఇక ఈ పరాజయంతో పంజాబ్ కు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లాయి.

ఇక ఒక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉండటంతో ఈ మ్యాచ్ లో గెలిచినా, సమీకరణాలు కూడా కలిసి వస్తేనే, ప్లే ఆఫ్స్ కు చేరే అవకాశముంటుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన పంజాబ్ ను భువనేశ్వర్ కుమార్ దెబ్బ కొట్టాడు. తొలి ఓవర్లోనే విధ్వంసక ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యను డకౌట్ చేశాడు. ఆ తర్వాత మరుసటి ఓవర్లో ప్రమాదకర ప్రభ్ సిమ్రాన్ సింగ్ (3) ను ఔట్ చేసి దెబ్బకొట్టాడు. ఈ సీజన్ లో పంజాబ్ కు మంచి ఆరంభాలను ఇచ్చిన ఓపెనర్లను ఔట్ చేసి, భువీ దెబ్బ తీశాడు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) ఔట్ చేసి, రసిక్ సలామ్ షాకిచ్చాడు. దీంతో పరుగుల వేగం తగ్గిపోయింది. పవర్ ప్లేలో కేవలం 49 పరుగులు మాత్రమే సాధించింది. ఈ దశలో కూపర్ కాన్నోలీ (37), శ్రేయాంశ్ షెడ్గే 35) వికెట్ల పతనాన్ని అడ్డుకుని, స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. వీరిద్దరూ ఎదురు దాడికి దిగి, భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. నాలుగో వికెట్ కు 43 పరుగులు జోడించిన తర్వాత కాన్నోలీ ఔటయ్యాడు. ఆ తర్వాత కాసేపటికి షెడ్గే కూడా వెనుదిరగడంతో, 93 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి, పంజాబ్ కష్టాల్లో పడింది. ఒక వైపు ఫామ్ కోల్పోయి, మరోవైపు వరుసగా క్యాచ్ లు వదిలేసి డల్ అయిన శశాంక్ సింగ్.. ఈ మ్యాచ్ లో సత్తా చాటాడు. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడిన శశాంక్, సుయాశ్ శర్మ బౌలింగ్ లో భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మార్కస్ స్టొయినిస్ (37) తో కలిసి ఆరో వికెట్ కు వేగంగా 67 పరుగులు జోడించడంతో పంజాబ్ గేమ్ లోకి వచ్చింది. అయితే సాఫీగా సాగుతున్న ఈ భాగస్వామ్యాన్ని విడదీసిన జోష్ హేజిల్ వుడ్.. ఆర్సీబీని తిరిగి గేమ్ లోకి తెచ్చాడు. మరో ఎండ్ లో 22 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన శశాంక్, ఆఖరు వరకు నిలిచి, జట్టును గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు. ఇక పంజాబ్ కు ఇది వరుసగా ఆరో పరాజయం కావడం విశేషం.


## చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ..

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఓ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 3 సిక్స్‌లు బాదడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. తద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు.ఐపీఎల్ 2024 సీజన్‌లో అభిషేక్ శర్మ 42 సిక్స్‌లు బాదగా.. వైభవ్ సూర్యవంశీ తాజా సీజన్‌లో మొత్తం 43 సిక్స్‌లతో అతన్ని అధిగమించాడు. ఈ జాబితాలో వైభవ్(43), అభిషేక్ శర్మ(42) తర్వాత శ్రేయస్ అయ్యర్(39), విరాట్ కోహ్లి (38), సూర్యకుమార్ యాదవ్(38) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 39 సిక్స్‌లు బాదగా.. విరాట్ కోహ్లి 2016, 2024లో 38 సిక్స్‌లు కొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ 2025లో 38 సిక్స్‌లు బాదాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ మరో లీగ్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఒకవేళ ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరితే వైభవ్ సిక్సర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(24 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. ధ్రువ్ జురెల్(40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53), కెప్టెన్ రియాన్ పరాగ్(26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. దాంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(4/40) నాలుగు వికెట్లు తీయగా.. లుంగి ఎంగిడి, మాధవ్ తివారి రెండేసి వికెట్లు పడగొట్టారు.



## శ్రేయస్ అయ్యర్ అరుదైన రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ తన లీడర్‌షిప్ కెరీర్‌లో ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నాడు. ఆదివారం ధర్మశాల వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఐపీఎల్ 2026 మ్యాచ్‌లో టాస్ వేయడానికి బరిలోకి దిగడం ద్వారా ఆయన ఈ ఘనత సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో ఒక జట్టుకు 100 మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ వహించిన ఐదో ప్లేయర్‌గా శ్రేయాస్ అయ్యర్ నిలిచాడు.ఈ అరుదైన లిస్టులో ఆయన లీగ్ దిగ్గజాలైన మహేంద్ర సింగ్ ధోని, గౌతమ్ గంభీర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల సరసన చేరాడు. కేవలం 31 ఏళ్ల వయస్సులోనే శ్రేయాస్ అయ్యర్ ఈ స్థాయికి చేరుకోవడం ఆయన లీడర్‌షిప్ స్కిల్స్ కు, ట్యాక్టికల్ మైండ్‌కు ఒక నిదర్శనం. మూడు వేర్వేరు ఫ్రాంచైజీలకు కెప్టెన్ గా పనిచేసి సక్సెస్ అవ్వడం వల్ల లీగ్ లో ఆయనకు భారీ డిమాండ్ ఏర్పడింది. శ్రేయాస్ అయ్యర్ తన ఐపీఎల్ కెప్టెన్సీ ప్రయాణాన్ని 2018 లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో ప్రారంభించాడు. ఢిల్లీ ఫ్రాంచైజీకి ఆయన 41 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించి, 2020 సీజన్ లో ఆ జట్టును మొదటిసారి ఐపీఎల్ ఫైనల్స్ కు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత ఆయన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు మారాడు. అక్కడ 2022 నుండి 2024 మధ్య కాలంలో 29 మ్యాచ్‌లకు కెప్టెన్ గా వ్యవహరించి, 2024 లో కేకేఆర్ జట్టుకు ఐపీఎల్ ట్రోఫీని అందించి వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. 2025 నుంచి పంజాబ్ కింగ్స్ జట్టుతో తన కొత్త చాప్టర్ ప్రారంభించిన శ్రేయాస్, వారిని కూడా ఫైనల్స్ కు చేర్చాడు. ఈ ప్రదర్శనతో ఐపీఎల్ చరిత్రలోనే మూడు వేర్వేరు జట్లను టోర్నమెంట్ ఫైనల్స్ కు నడిపించిన ఏకైక కెప్టెన్ గా ఆయన సరికొత్త రికార్డు సృష్టించాడు. ఆదివారం నాటి మ్యాచ్‌కు ముందు వరకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ గా ఆడిన 99 మ్యాచ్‌ల్లో 56 విజయాలు నమోదు చేశాడు. ఇందులో రెండు సూపర్ ఓవర్ విక్టరీలు కూడా ఉన్నాయి. మరోవైపు 40 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడగా, మూడు మ్యాచ్‌లు ఎలాంటి ఫలితం లేకుండా రద్దయ్యాయి. ఫలితం తేలిన మ్యాచ్‌లను బట్టి చూస్తే ఆయన సక్సెస్ రేట్ 58.3 శాతంగా ఉంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన కెప్టెన్ అయిన ఎంఎస్ ధోని విన్ పర్సంటేజ్ రికార్డ్‌ను శ్రేయాస్ అయ్యర్ సమం చేయడం



విశేషం. వేర్వేరు జట్లు, రకరకాల కాంబినేషన్లను హ్యాండిల్ చేస్తూ కూడా ఆయన ఇంతటి స్థిరమైన ప్రదర్శన చేయడం వల్ల మోడ్రన్ ఐపీఎల్ ఎరాలో బెస్ట్ లీడర్ గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఐపీఎల్ 2026 సీజన్ లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం చాలా ఒడిదొడుకులతో సాగుతోంది. టోర్నీ ప్రారంభంలో వరుసగా ఏడు మ్యాచ్‌ల పాటు ఓటమి లేకుండా దూసుకుపోయిన పంజాబ్ జట్టు ఆరు విజయాలు సాధించింది. ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. అయితే సీజన్ మధ్యలోకి వచ్చేసరికి ఆ జట్టు లయ తప్పింది. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో వారి ప్లేఆఫ్స్ అవకాశాలు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డాయి. అయినప్పటికీ కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ ప్రయాణం మాత్రం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగుతోంది. ఢిల్లీ జట్టును పవర్‌ఫుల్ గా మార్చడం, కోల్‌కతాకు టైటిల్ అందించడం, ఇప్పుడు పంజాబ్ జట్టు రాత మార్చడానికి ప్రయత్నించడం ద్వారా ఆయన లీగ్ లో ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. ఈ ఆల్ టైమ్ కెప్టెన్సీ లిస్టులో చెన్నై సూపర్ కింగ్స్, రైజింగ్ పుణే సూపర్ జెయింట్ జట్లకు కలిపి 235 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించిన ఎంఎస్ ధోని అందరికంటే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. ఆల్ రౌండర్ వెంకటేష్ అయ్యర్ స్టన్నింగ్ ఫిఫ్టీ (40 బంతుల్లో 73 నాటౌట్, 8 ఫోర్లు, 4 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సూపర్బ్ ఫిఫ్టీ (37 బంతుల్లో 58, 4 ఫోర్లు, 3 సిక్సర్లు)తో, దేవదత్ పడిక్కల్ (45) సత్తా చాటారు. బౌలర్లలో హర్ ప్రీత్ బ్రార్ కు రెండు వికెట్లు దక్కాయి.

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి..

రన్ మేషిన్ విరాట్ కోహ్లి ఖాతాలో మరో రికార్డ్ చేరింది. అతడ్ని ఊరికే 'రికార్డుల బాద్‌షా' అని పిలవరు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోహ్లి మరో రికార్డును నెలకొల్పాడు. దీనిని బద్దలు కొట్టడం ఇతర బ్యాటర్లకు దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. విరాట్ కోహ్లి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో 500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఈ ఘనత సాధించాడు. 9 వేర్వేరు ఐపీఎల్ సీజన్‌లలో 500 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ప్రపంచంలోనే మొదటి బ్యాటర్‌గా నిలిచాడు. 2026లో ఆడిన 13 ఇన్నింగ్స్‌లలో విరాట్ కోహ్లి ఇప్పటివరకు 542 రన్స్ చేసి దూసుకెళు న్నాడు. ఈ క్రమంలో కోహ్లి ఒక సెంచరీ, 4 అర్ధ సెంచరీలు సాధించాడు. మొత్తం కెరీర్‌లో 2026 సీజన్‌లో విరాట్ వ్యక్తిగత స్ట్రైక్ రేట్ ఎక్కువగా ఉంది. 2026లో ఇప్పటివరకు 164.74 స్ట్రైక్ రేట్‌తో కోహ్లి బ్యాటింగ్ చేశాడు. వరుసగా నాలుగో సీజన్లో 500కు పైగా రన్స్, అది కూడా రిటైర్మెంట్ స్టేజీలో చేయడం కోహ్లి సత్తా ఏంటో చూపుతుంది. ఐపీఎల్ లో 9 వేల పరుగులు చేసిన తొలి, ఏకైక బ్యాటర్ కోహ్లినే. 9 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో అత్యధిక సీజన్‌లలో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్ విరాట్ కోహ్లినే. అయినప్పటికీ తాజా సీజన్లోనూ 500 రన్స్ మార్క్ దాటాడు. దాంతో ఇప్పటివరకు 9 వేర్వేరు సీజన్‌లలో ఐదు వందల కంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి, ఏకైక బ్యాటర్‌గా విరాట్ నిలిచాడు. ఈ జాబితాలో డేవిడ్ వార్నర్, కెఎల్ రాహుల్ రెండవ స్థానంలో ఉన్నారు. రాహుల్, డేవిడ్ వార్నర్ ఏడు ఐపీఎల్ సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు సాధించారు. విరాట్ కోహ్లి తన త్రూా కెరీర్‌లో 9 వేర్వేరు సీజన్‌లలో 500 కంటే ఎక్కువ రన్స్ చేశాడు. మొదటిసారిగా 2011లో 500 పరుగుల మార్కును సాధించాడు. ఆ సీజన్లో కోహ్లి 16 మ్యాచ్‌లలో 557 పరుగులు స్కోర్ చేశాడు. ఆపై 2013, 2015, 2016, 2018, 2023, 2024, 2025, 2026 సీజన్లలోనూ ఈ ఫీట్ రిపీట్ చేశాడు. ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కోహ్లి పేరిట ఉంది. ఆర్సీబీ బ్యాటర్ కోహ్లి 2016 సీజన్‌లో ఏకంగా 973 పరుగులు చేశాడు. ఆ సీజన్లో ఆర్సీబీ ఫైనల్ చేరినా.. సన్‌రైజర్స్ చేతిలో ఓటమిపాలైంది. ఆర్సీబీకి ఇంత బ్రాండింగ్ రావడానికి కారణం విరాట్. ఎంతో మంది దిగ్గజాలు వచ్చి పోతున్నా కోహ్లి మాత్రం 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్ నుంచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకే ఆడుతున్నాడు. దాదాపు దశాబ్దం పాటు ఆర్సీబీ కెప్టెన్‌గా కొనసాగాడు. ఆర్సీబీ 2025లో తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ సీజన్లోనూ కోహ్లి 657 పరుగులతో కీలకపాత్ర పోషించాడు.



# డీసీ అద్భుత విజయం..

## ప్లే ఆఫ్ ఆశలు సజీవం..

తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జూలు విదిల్చింది. ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ పై 5 వికెట్లతో ఘన విజయం సాధించింది. అంతకుముందు ఢిల్లీలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురేల్ స్టన్నింగ్ ఫిఫ్టీ (40 బంతుల్లో 53, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. మిషెల్ స్టార్క్ కు నాలుగు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ను ఢిల్లీ కంపర్టబుల్ పూర్తి చేసింది. కేవలం 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 197 పరుగులు చేసింది. సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సూపర్బ్ ఫిఫ్టీ (42 బంతుల్లో 56, 1 ఫోర్, 3 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ , బ్రిజేశ్ శర్మకు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ప్లే ఆఫ్ అవకాశాలను డీసీ సజీవంగా ఉంచుకుంది. మరో మ్యాచ్ లో విజయం సాధించడంతోపాటు కొన్ని సమీకరణాలు కలిసి రావాలి. మరోవైపు మిగతా రెండు మ్యాచ్ ల్లో గెలిస్తేనే రాయల్స్ ప్లే ఆఫ్స్ కు అర్హత సాధిస్తుంది. ఇక సోమవారం జరిగే మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ తో సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.

కాస్త భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన డీసీకి ఓపెనర్లు రాహుల్, అభిషేక్ పోరెల్ (31 బంతుల్లో 51, 7 ఫోర్లు, 1 సిక్సర్) చక్కని శుభారంభం అందించారు. నిజానికి ఫస్ట్ ఓవర్లోనే లభించిన లైఫ్ తో రాహుల్ చక్కగా ఆడాడు. మరో ఎండ్ లో పోరెల్.. చూడ చక్కని షాట్లతో అలరించాడు. దీంతో పవర్ ప్లేలో 76 పరుగులను రాబట్టింది. ఈక్రమంలో పోరెల్ 29 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అలాగే రాహుల్ కూడా 34 బంతుల్లో ఫిఫ్టీ కంప్లీట్ చేసుకున్నాడు. తొలి వికెట్ కు 105 పరుగులు జోడించిన తర్వాత పోరెల్ ను బ్రిజేశ్ శర్మ పెవిలియన్ కు పంపాడు. వన్ డౌన్ లో వచ్చిన సాహిల్ పరాఖ్ (9) ను జోఫ్రా ఆర్చర్ పెవిలియన్ కు పంపాడు. ఈ దశలో బరిలోకి దిగిన అక్షర్ పటేల్ కెప్టెన్ ఇన్నింగ్స్ (18 బంతుల్లో 34 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు)తో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. రెండు భారీ సిక్సర్లతో ఒత్తిడిని తీసేసి, జట్టును విజయపథం వైపు నడిపాడు. ఇక ఫిఫ్టీ పూర్తయ్యాక రాహుల్ పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో ట్రిస్టన్ స్టబ్స్ (4), డేవిడ్ మిల్లర్ (9) విఫలమైనా, ఫినిషర్ అశుతోష్ శర్మ (18 నాటౌట్) రెండు భారీ సిక్సర్లతో మ్యాచ్ ను ఫినిష్ చేశాడు. ఇక ఈ విజయం డీసీకి వరుసగా రెండో విజయం కాగా, రాయల్స్ కు హ్యాట్రిక్ పరాజయం కావడం గమనార్హం. నాలుగు వికెట్లతో సత్తా చాటిన మిషెల్ స్టార్క్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.





## మే 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైన శ్రద్ధాదాస్ 'త్రికాల'

- మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఆకట్టుకోనున్న 'త్రికాల'
- హై క్వాలిటీ VFXతో గ్రాండ్ విజువల్ ఎక్స్‌పీరియన్స్
- ట్రైలర్, పాటలతో సినిమాపై భారీ అంచనాలు
- చాగంటి ప్రొడక్షన్ LLP సమర్పణలో వరల్డ్‌వైడ్ రిలీజ్
- హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణ

భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక–శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమా నచ్చడంతో చాగంటి ప్రొడక్షన్ LLP ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో 'త్రికాల'పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన హైక్వాలిటీ VFX ఈ సినిమాకు ప్రధాన బలం కానుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్సులు, అజయ్ పవర్‌ఫుల్ పాత్ర, శ్రద్ధాదాస్ కొత్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ... "ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు 'త్రికాల' ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది" అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ... "సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన 'త్రికాల' ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. అర్జున్ రెడ్డి , అనిమల్, స్పిరిట్ వంటి హిట్ సినిమాలకు మ్యూజిక్ అందించిన హర్షవర్ధన్ రమేశ్వర్.. 'త్రికాల'కు కూడా మంచి మ్యూజిక్ అందించారు. ఇప్పటికే ఈ చిత్రానికి నార్త్ ఇండియాలో కూడా మంచి బిజినెస్ జరిగింది. హిందీ శాటిలైట్ హక్కులతో పాటు డబ్బింగ్ రైట్స్ ఫ్యాన్సీ రేటుకు అమ్ముడుపోయింది. టాలీవుడ్‌లో శ్రద్ధదాస్ 'సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమై, తరువాత Arya 2 ద్వారా మంచి గుర్తింపు సంపాదించింది. అనంతరం 'గుంటూరు టాకీస్', 'ఏక్ మినీ కథ', 'డిక్టేటర్', 'నాగవల్లి' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'త్రికాల'తో మరోసారి విభిన్నమైన పాత్రలో కనిపించబోతోంది. మొత్తంగా మైథలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన 'త్రికాల' మే 29న ప్రేక్షకుల ముందుకు రానుండటంతో సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

## 'పురుష:' చిత్రం ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది - హీరో పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని మే 22న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో పవన్ కళ్యాణ్ మీడియాతో పంచుకున్న విశేషాలివే..

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మాది పల్నాడులోని మాచర్ల దగ్గర్లోని కారంపూడి. మాకు సినిమా ఇండస్ట్రీతో ఎలాంటి రిలేషన్ లేదు. మా నాన్న గారు కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ఉన్నారు. మా నాన్నకి నచ్చకుండా ఏ పనీ చేయను. నాకు నచ్చని ఏ పని కూడా మా నాన్న గారు చేయరు.

**మీ పేరు వెనకాల ఉన్న స్టోరీ చెప్పండి? ఈ ఇండస్ట్రీలోకి రావాలన్నది ఎవరి ఆలోచన?**

మా నాన్న గారు 'గోకులంలో సీత' సినిమా చూశారు. అప్పటికి నేను ఇంకా పుట్టలేదు. అయితే 'తమ్ముడు' టైంలో పుట్టాను. నాకు పవన్ కళ్యాణ్ అని పేరు పెట్టారు. నన్ను హీరో చేయాలన్నది మా నాన్న కల. అయితే మా కాలేజ్‌లో సినిమా ఈవెంట్లు జరుగుతుండేవి. నాక్కూడా సినిమాలంటే చాలా ఇష్టం. మా నాన్న గారికి కూడా నన్ను హీరో చేయాలనే ఆశ ఉండటంతో ఇటు వైపుగా వచ్చేశాను.

**నటనలో శిక్షణ తీసుకున్నారా?**

వైజాగ్‌లో సత్యానంద్ గారి వద్ద యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. సర్ ఉండే కమ్యూనిటీ లోనే నేను కూడా ఉన్నాను. నాలుగు నెలలు ఆయనతోనే కలిసి ఉన్నాను. ఆయన ట్రైనింగ్ మాత్రమే ఇస్తారు. రిఫరెన్సులు చేయరు. ఆయన వద్ద నేను ఎంతో నేర్చుకున్నాను.

**'పురుష:' కథనే ఎందుకు ఎంచుకున్నారు?**

డీఓపీ సతీష్ గారి వల్లే ఈ ప్రాజెక్ట్ మా దగ్గరకు వచ్చింది. సినిమాలతో ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించాలని అనుకున్నాం. అందుకే నా మొదటి మూవీగా ఇలాంటి ఓ ఫ్యామిలీ కథతో వస్తున్నాను. ఫ్యామిలీ ఆడియెన్స్‌కి నచ్చేలా ఈ మూవీని రూపొందించాం. ఓ మంచి చిత్రాన్ని చూశామన్న ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వెళ్తారు.



**సీనియర్ ఆర్టిస్టులతో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

'పురుష:'లో చాలా మంది సీనియర్ ఆర్టిస్టులున్నారు. అందరూ నాకు ఎంతో సహకరించారు. మరీ ముఖ్యంగా సప్తగిరి అన్నా, కసిరెడ్డి అన్నా ప్రతీ ఒక్క విషయంలో హెల్ప్ చేశారు. అందరి సహకారంతోనే సినిమాని చేయగలిగాను.

**'పురుష:'లో మెయిన్ పాయింట్స్ ఏంటి?**

'పురుష:' చిత్రంలో అన్ని పాత్రలకు సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' సినిమాని ఆడియెన్స్ ఎంతో ఎంజాయ్ చేశారు. మా సినిమా కూడా అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటుంది. ప్రతీ సీన్‌ను ఎంతో కేర్ తీసుకుని చేశాం. ఈ ప్రయాణంలో సినిమా ఆర్టిస్టుల కష్టాలన్నీ నాకు తెలిశాయి.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

వీరు అన్న నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. నేను చాలా ఇంట్రోవర్ట్‌గా ఉండేవాడ్ని. నన్ను నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకు వచ్చారు. ఆయన ఇచ్చిన సహకారంతోనే సినిమాని బాగా చేయగలిగాను.

**'పురుష:' జర్నీలో మీ సోదరి సరస్వతి ఇచ్చిన సపోర్ట్ గురించి చెప్పండి?**

మా సిస్టర్ సరస్వతికి పెళ్లైంది. ఇద్దరు బిడ్డలు కూడా ఉన్నారు. మా సిస్టర్‌కి నేనంటే చాలా ఇష్టం. అందుకే నా కోసమే ఎక్కువ ఆలోచిస్తుంటారు. 'పురుష:' సినిమాలోని ప్రతీ విషయంలో ఆమె నాకు తోడుగా నిలిచారు. ఆమె సపోర్ట్ లేకపోతే ఇక్కడి వరకు వచ్చేవాడ్ని కాదు.

**మీకు ఎలాంటి జానర్స్ అంటే ఇష్టం?**

నా ఫ్రెండ్స్ ఎక్కువగా యాక్షన్ చిత్రాలు చేయమని సలహాలు ఇస్తుంటారు. కానీ ఏ జానర్‌లో సినిమా చేసినా కూడా ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయాలన్నదే లక్ష్యం.

**'పురుష:' గురించి ఆడియెన్స్‌కి ఏం చెబుతారు? నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి చెప్పండి?**

'పురుష:' సినిమాని ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. కచ్చితంగా విజయం సాధిస్తుందని అన్నారు. ఈ సినిమా ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. ఈ చిత్రం విడుదలైన తరువాత తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆలోచిస్తాను.

## నిర్మాతగా నా తొలి సినిమా రామ్ చరణ్ గారితో చేయడం నా అదృష్టం

**'పెద్ది' టైటిల్ కార్డ్స్ నుంచి ఎండింగ్ వరకు ప్రేక్షకులు సీట్ నుంచి కదలలేరు**
**ప్రేక్షకులు కోరుకునే అన్నీ ఎలిమేంట్స్ పెద్దిలో ఫుల్ ప్యాక్డ్ గా ఉన్నాయి: నిర్మాత వెంకట సతీష్ కిలారు**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట సతీష్ కిలారు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ తొలి ప్రొడక్షన్ రామ్ చరణ్ గారు లాంటి పెద్ద హీరోతో చేయడం ఎలా అనిపించింది?**

–రామ్ చరణ్ గారు సినిమా ఇవ్వడం నా అదృష్టం. ఆయన ఒప్పుకుంటేనే ఇది సాధ్యపడింది. ఈ సందర్భంగా రామ్ చరణ్ గారికి ధన్యవాదాలు.

–ఈ సినిమాను మేము అనుకున్న బడ్జెట్‌లో, గ్రాండ్ స్కేల్‌లో అద్భుతంగా తెరకెక్కించాం. తొలి రోజు నుంచి చివరి రోజు వరకు అదే పాజిటివ్ ఎనర్జీతో పని చేశాం. షూటింగ్ చివరి రోజు హీరో గారు, డైరెక్టర్ గారు అందరూ చాలా ఎమోషనల్ అయ్యారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

–మాది వ్యవసాయ కుటుంబం. మా నాన్నగారు రైతు. విజయవాడలో చదువుకున్నాను. ఇంజనీరింగ్ తర్వాత కన్స్ట్రక్షన్ ఫీల్డ్‌లోకి వెళ్లాను. నవీన్ గారు నా క్లోజ్ ఫ్రెండ్. ఆయనకు సినిమాలంటే చాలా ఇష్టం. అలా మేము సినిమాల్లోకి వచ్చాం.

**నిర్మాతగా మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?**

–చాలెంజెస్ అనేవి మనం డీల్ చేసే విధానాన్ని బట్టి స్మూత్‌గా మారుతాయి. ఈ సినిమా వరకు మా జర్నీ చాలా హ్యాపీగా సాగింది. తొలి రోజు నుంచి చివరి రోజు వరకు షూటింగ్ చాలా కూల్‌గా జరిగింది. ఎలాంటి పెద్ద చాలెంజెస్ ఎదురుకాలేదు.

**బుచ్చిబాబు గారు కథ చెప్పినప్పుడు మీకు ఇందులో నచ్చిన అంశాలు ఏంటి?**

–కథ మొత్తం అద్భుతం. సినిమా మొదలైనప్పటి నుంచి చివరి వరకు ప్రేక్షకులు థియేటర్‌లో కూర్చునే ఉంటారు. కమర్షియల్ ఎలిమెంట్స్, ఎమోషన్స్... ప్రతిదీ ఎక్స్ట్రార్డినరీగా ఉంటుంది. ప్రేక్షకుడు సినిమాలో ఏం కోరుకుంటాడో, అవన్నీ ఒక పూర్తి ప్యాకేజ్‌లా బుచ్చిబాబు గారు అందించారు.

**చరణ్ గారి గురించి?**

–చరణ్ గారు ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేం. అది స్క్రీన్‌పై చూసినప్పుడే ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ఎంత అద్భుతంగా ఉందో ప్రేక్షకులకు అర్థమవుతుంది. సినిమా కోసం రెండేళ్ల పాటు ప్రత్యేక ట్రైనర్ ని పెట్టుకొని వర్క్ చేశారు. గాయాలను లెక్కచేయకుండా శరీరాన్ని హూనం చేసుకున్నారు. కంటికి కుట్లు వేసుకున్న మరుసటి రోజే షూటింగ్‌కు వచ్చారు. అది ఆయన డెడికేషన్.

–ఇది చాలా ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ ఉన్న సినిమా. డైరెక్టర్ గారు ఏది చెప్పారో, చరణ్ గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఆ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. కొన్ని సందర్భాల్లో ఆయన శరీరం సహకరించకపోయినా, ఫిజియో చేయించుకుని వెంటనే షూట్‌కు రెడీ అయ్యేవారు. ఆయన పడిన కష్టం ప్రేక్షకులు బిగ్ స్క్రీన్‌పై చూడబోతున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు నేను సెట్‌లోనే ఉండేవాడిని.

**ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ గురించి?**

–ఏఆర్ రెహమాన్ గారు లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్. బుచ్చిబాబు గారు కథ అనుకున్నప్పుడే రెహమాన్ గారి పేరును ఫిక్స్ చేసుకున్నారు. ఆయన కథ విన్న తర్వాత మాకంటే ఎక్కువ ఎక్సైట్ అయ్యారు. ఈ సినిమా కోసం మా కంటే ఎక్కువగా ఆయన పని చేశారు. ప్రతి విషయాన్ని చాలా డీటైల్‌గా కంపోజ్ చేశారు. ఆయన సపోర్ట్‌ను మర్చిపోలేం. అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు. పాటలన్నీ ఎంత అద్భుతంగా జనాల్లోకి వెళ్లాయో మనందరం చూశాం.

**సినిమా బిజినెస్ ఎలా జరుగుతోంది?**



–బిజినెస్ మొత్తం క్లోజ్ అయిపోయింది. చాలా ప్రశాంతంగా ఉన్నాం.

**ఇప్పటికే సినిమా చుట్టూ భారీ అంచనాలు ఉన్నాయి కదా.. ట్రైలర్ ఎలా ఉంటుంది?**

–ట్రైలర్ వచ్చిన తర్వాత అంచనాలు మరింత పెరుగుతాయి. ఎన్ని అంచనాలు పెట్టుకున్నా వాటిని మించేలా సినిమా ఉంటుంది. ట్రైలర్ చూసిన ప్రేక్షకులు వెంటనే సినిమా చూడాలని అనుకుంటారు. టైటిల్ కార్డ్స్ పడినప్పటి నుంచి ఎండింగ్ వరకు ప్రేక్షకులు సీట్ నుంచి కదలలేరు. అంత ఫుల్ ప్యాక్డ్‌గా సినిమా ఉంటుంది. 'పెద్ది'ని చూడాలని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పాన్ ఇండియా, ఓవర్సీస్‌లో సినిమా గ్రాండ్‌గా రిలీజ్ అవుతుంది.

**'పెద్ది'లో సుకుమార్ గారి ఇన్వాల్వ్‌మెంట్ ఉందా?**

–సుకుమార్ గారి ఇన్వాల్వ్‌మెంట్ ఉందని నేను అనుకోవడం లేదు. కథ నుంచి మొత్తం బుచ్చిబాబు గారే చూసుకున్నారు. కథ విషయంలో ముందుగా ఆయన గురువుగారు సుకుమార్ గారితో షేర్ చేసుకుని ఉండొచ్చు ఏమో కానీ షూటింగ్ మొదలైన తర్వాత మొత్తం బుచ్చిబాబు గారే చూసుకున్నారు.

**శివరాజ్ కుమార్ గారి గురించి?**

–శివరాజ్ కుమార్ గారు, జగపతిబాబు గారు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ, టీను ఆనంద్... ఇలా ప్రతి క్యారెక్టర్ కథతో బలంగా ముడిపడి ఉంటుంది. ఆ పాత్రల్లో వాళ్లు జీవించేశారు. ప్రతి క్యారెక్టర్ ఇంపాక్ట్‌ను ప్రేక్షకులు బలంగా ఫీల్ అవుతారు.

**డీవోపీరత్నవేలు గారి గురించి?**

–రత్నవేలు గారు ది బెస్ట్ విజువల్స్ ఇచ్చారు. ఇది 80ల బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ. మా ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ అద్భుతమైన సెట్లు వేశారు. 'పెద్ది' కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించారు. శ్రీలంక, పూణే, ఢిల్లీ వంటి రియల్ లొకేషన్స్‌లో కూడా షూట్ చేశాం.

**రిలీజ్‌కు ముందు చాలా కూల్‌గా కనిపిస్తున్నారు?**

–మా కంటెంట్‌పై చాలా నమ్మకం ఉంది. అదే మాకు కాన్ఫిడెన్స్ ఇస్తోంది. ట్రైలర్ చూసిన తర్వాత ప్రేక్షకుల్లో ఎక్సైట్మెంట్ మరింత పెరుగుతుంది.

**నెక్స్ట్ చేయబోయే సినిమా గురించి?**

–బాలకృష్ణ గారితో సినిమా నడుస్తోంది.

## విజయ్ ఆంటోని, శశి కాంబోలో రానున్న 'వంద దేవుళ్ళు' నుంచి మెలోడీ గీతం 'రీంగారా.. రీంగారా' విడుదల

విజయ్ ఆంటోని హీరోగా శశి దర్శకత్వంలో వచ్చిన 'బిచ్చగాడు' ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక ఇన్నేళ్ల తరువాత మళ్లీ 'బిచ్చగాడు' మ్యాజిక్ రిపీట్ చేసేందుకు 'వంద దేవుళ్ళు' అనే సినిమాతో విజయ్ ఆంటోనీ, శశి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇక ఈ మూవీకి సంబంధించి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా మదర్ సెంటిమెంట్‌తో సాగే 'అమ్మ అమ్మేగా' అనే పాట అందరినీ కదిలించింది. ఇక ఇప్పుడు ఒక రొమాంటిక్, మెలోడీ గీతాన్ని రిలీజ్ చేశారు. ఈ పాటలో లిజమోల్ జోస్, అజయ్ ధీషాన్ జంట ఆకట్టుకుంటోంది. 'రీంగారా' అంటూ సాగే ఈ పాటను భాష్య శ్రీ ఎంతో అద్భుతంగా రాశారు. ఆయన సాహిత్యం ఎంతో వినసొంపుగా ఉంది. బాలాజీ శ్రీరామ్ బాణీ ఎంతో శ్రావ్యంగా ఉంది. సంతోష్ హరిహరణ్, మానసి జి కణ్ణన్ ఆలపించిన ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఈ మూవీని సమ్మర్ కానుకగా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.



## ఘనంగా "బ్లాక్ మెయిల్" చిత్ర ప్రారంభం

వరుణ్ సందేశ్ హీరోగా హనుమాన్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై అవినాష్ కూనపరెడ్డి నిర్మాతగా శ్రీనివాస్ గుండ్రెడ్డి రచన దర్శకత్వంలో ప్రారంభమైన చిత్రం బ్లాక్ మెయిల్.




పూజా కార్యక్రమాలతో నేడు హైదరాబాద్ లోని ప్రసాద్ లో ఈ చిత్ర ప్రారంభం ఘనంగా జరిగింది. జెమిని సురేష్, పృథ్వీరాజ్, సమ్మెట గాంధీ, నాగ మహేష్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. జి ఎస్ చక్రవర్తి రెడ్డి సినిమాటోగ్రఫీ చేస్తున్న ఈ చిత్రానికి రాఘవేంద్ర రెడ్డి ఎడిటర్ గా చేస్తుండగా, ఎస్ వి మల్లిక్ తేజ సంగీత దర్శకుడుగా పనిచేస్తున్నారు. ఈ చిత్ర స్క్రిప్ట్ నిర్మాతల చేతుల మీదుగా దర్శకునికి అందించగా ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట గారు మొదటి క్లాప్ కొట్టారు. సీనియర్ నిర్మాత భరద్వాజ్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా జెమిని సురేష్ గారి తల్లి ఎం వెంకట సుబ్బ లక్ష్మి గారు మొదటి షాట్ దర్శకత్వం చేశారు. ఈ కార్యక్రమానికి నటుడు రక్షిత్ అట్లూరి, నటి శ్రీలు తదితరులు హాజరై తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి గారు మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. మా సినిమాకు సపోర్ట్ చేస్తూ ఈ కార్యక్రమానికి వచ్చిన మీడియా వారికి, మమ్మల్ని సపోర్ట్ చేస్తూ వచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు. మంచి ప్రాజెక్ట్ ను నమ్మి నా చేతిలో పెట్టిన నిర్మాతలకు కృతజ్ఞతలు. నాకంటూ ఒక గుర్తింపు ఇచ్చింది మీడియా వారే, ఈ సినిమాకు మీ ప్రమోషన్ మంచి ఫలితం ఇస్తుంది" అన్నారు. హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ... "మా సినిమా బ్లాక్ మెయిల్ చిత్ర ప్రారంభానికి వచ్చిన అందరికీ థాంక్స్. నాకు దర్శకులు చాలా కాలంగా పరిచయం. ఆయన ఈ కథ చెప్పినప్పుడు మంచి కంటెంట్ తో సినిమా వస్తుంది అని అర్థం అయింది. నిర్మాతలకు, అతిథులకు నా థాంక్స్. త్వరలో చిత్ర షూటింగ్ మొదలవబోతుంది" అన్నారు. నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ... "బ్లాక్ మెయిల్ చిత్రంతో వరుణ్ సందేశ్ గారితో కలిసి నటించబోతున్నారు. ముఖ్యంగా చిత్ర నిర్మాతకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నిర్మాతగానే కాకుండా ప్రతి మార్గంలో ఆయన అండగా నిలిచారు. నేను హీరోగా తొలి చిత్రం దర్శకత్వం చేసిన శ్రీనివాస్ గారు ఈ చిత్రంలో మంచి పాత్ర ఇవ్వడం ఆనందంగా అనిపించింది. అలాగే నాతో కలిసి నటిస్తున్న ప్రతి నటీనటులకు, అతిథులకు నమస్కారాలు తెలియచేసుకుంటున్నాను. నాతో స్క్రీన్ షేర్ చేసుకుంటున్న వరుణ్ సందేశ్ గారికి ప్రత్యేకంగా థాంక్స్. ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉండబోతుంది. మా సినిమాకు నా మీడియా సోదరులు సపోర్ట్ చేయవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు.


Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 68-5-1/1,Near Municipal Complex , Patamata,N.T.R , Andhra Pradesh-520010 .Editor : Sudheer kumar katepally ph: 9000657700, PRGI NO: APTEL/26/A2264